RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:217 | శనివారం | 12 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

## రిపోర్టర్లు కావలెను




జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

# విద్యా రంగంలో సంస్కరణల హోరు

- మూడేళ్లలో రూ.7,554 కోట్లు పెరిగిన బడ్జెట్
- 10,006 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశాం
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 :
రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో తెలిపారు. సభలో విద్యా విధానంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ప్రభుత్వం తరపున కీలక వివరాలను వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో (2023-24) రూ.19,093 కోట్లు ఉన్న విద్యా శాఖ బడ్జెట్‌ను 2024-25 బడ్జెట్‌లో రూ.21,292 కోట్లకు పెంచాం. 2025-26 నాటికి రూ.23,108 కోట్లకు, 2026-27 నాటికి రూ.26,647 కోట్లకు పెంచుతాం. మొత్తం బడ్జెట్‌లో 15 శాతాన్ని విద్యకే కేటాయించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే విద్యా బడ్జెట్‌ను రూ.7,554 కోట్లకు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని సీఎం

మిగతా 2వ పేజీలో..



## జనగణనలో కులగణనను చేర్చాలి

- కులగణన చేద్దామా వద్దా.. బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం
- రాష్ట్రంలో చేసిన తీరులో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



## మత్స్యకారుల బతుకులకు భరోసా



- ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం
- ఇప్పటికే 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్
- నెల్లికల్ ఎత్తిపోతలపై సభాముఖంగా విస్పష్టమైన హామీ
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలి

- జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలి
- ఓబీసీల సమస్యలపై రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయాలి
- ఓబీసీల జనాభాపై కచ్చితమైన గణాంకాలుండాలి
- శాసనసభలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

2





2

## కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లు

- శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు



## బీజేపీని పక్కకు నెట్టేసిన కాంగ్రెస్–బీఆర్ఎస్ పోరు

- మళ్లీ కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గానే తెలంగాణ రాజకీయం
- అసెంబ్లీ, వీధుల్లో దూకుడుగా గులాబీ దళం
- బీఆర్ఎస్ ఆందోళనలతో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- కేసీఆర్–రేవంత్ చుట్టూనే సాగుతున్న పొలిటికల్ వార్
- ప్రధాన ప్రత్యామ్నాయంగా బీజేపీని నిలబెట్టడంలో కమలనాథుల వైఫల్యం
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ పెరుగుతున్న సవాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 10:
తెలంగాణలో గత మూడు రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోరే ప్రధానంగా సాగుతున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ చెరో ఎనిమిది స్థానాలు

మిగతా 3వ పేజీలో..



## ఆయుధాల చోరీ కేసులో నలుగురి అరెస్ట్

- కేసు ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు

3



## కాలనీలకు కాలనీలే 22ఎ కిందకు పోయినయ్

- గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు ఇప్పుడెందుకు జరగడంలేదు?
- ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం పోతున్నది
- రాత్రికి రాత్రే భూమిపై హక్కును తొలగించారు
- హెచ్‌సీయూ భూములు బోంబే స్టాక్ ఎక్చేంజ్‌లో తాకట్టు
- హిల్ట్ పాలసీ ద్వారా భూములను కొల్లగొట్టే యత్నం
- సిరిపూర్ కాగజ్ నగర్‌లో 30వేల ఎకరాలు 22ఎ కిందికి
- 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ భూములను తనఖా పెడుతున్నారు
- 22ఎ కిందికి పోయిన ప్లాట్లు, అపార్ట్ మెంట్ల వాసుల బతుకులు ఆగమాగం
- ప్రభుత్వ నిర్వాకంపై విరుచుకుపడ్డ హరీష్‌రావు

3

## ట్రాక్టర్లపై అసెంబ్లీకి వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11:
రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభా పక్షం

మిగతా 2వ పేజీలో..



## అటవీ శాఖ అమరుల సేవలు చిరస్మరణీయం

- అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో 23మంది సిబ్బంది ప్రాణత్యాగం
- డీజీపీ ఆనంద్
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి

3



## సమగ్ర నివేదికలు సమర్పించాలి

- అసెంబ్లీ, ఎరవ్రెల్లి ఫాంహౌస్ వద్ద ఘటనలపై..
- డీజీపీకి టీజీహెచ్ఆర్‌సీ ఆదేశం




2

## అనర్హుల ఖాతాలకు రూ.10 వేలు రిఫండ్

- హైదరాబాద్‌లో 40 వేల దరఖాస్తులు తిరస్కరణ
- వెబ్‌సైట్‌లో ఆధార్‌తో నంబర్ మార్చుకునే అవకాశం
- క్షేత్రస్థాయి సర్వే త్వరలో పూర్తి, త్వరలో ఫైనల్ లిస్ట్ విడుదల

2

## విమోచన దినాన్ని కనుమరుగు చేస్తున్న ప్రభుత్వం

- నాటి నిజాం పాలిత రాష్ట్రాల్లో విమోచన దినం పాటింపు
- మజ్లిస్ ఆదేశాలతో ఇక్కడి ప్రభుత్వాలు నిర్వహించడంలేదు
- బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

4




## ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు రూ.180 కోట్లు విడుదల

- 3,008 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులకు లబ్ధి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 :
విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘకాలంగా

మిగతా 3వ పేజీలో..

## మా సమస్యలపైనే ఫిర్యాదు చేయాల్సి వచ్చింది

- ప్రజాప్రతినిధులమని చూడకుండా దాడి
- దాడులను ఖండించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉన్నారు
- మహిళా కమిషన్, ఎన్‌హెచ్ ఆర్‌సీకి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదు
- తక్షణం డీజీపీని నివేదిక కోరతామన్న మహిళా కమిషన్ చైర్ పర్సన్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 :
ప్రభుత్వ దుర్మార్గపు పాలనపై ప్రజల పక్షాన పోరాడాల్సిన తాము తమను రక్షించుకునేందుకు, తమ సమస్యను పరిష్కరించుకునేందుకు పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా

మిగతా 4వ పేజీలో..



## కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :**

రాష్ట్రంలో క్యూర్ పరిధి వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లను నియమించనున్నట్లు శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రతి కార్పొరేషన్‌లో ఒకరిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఈమేరకు తెలంగాణ మున్సిపల్ చట్టం 2019కి సవరణ కోరుతూ ఆయన బిల్లు ప్రవేశపెట్టారు. సామాజికంగా వివక్ష ఎదుర్కొంటున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి పలు కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

## అనర్హుల ఖాతాలకు రూ.10 వేలు రిఫండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసి లిస్ట్‌లో పేరు రాలేదా.. అయితే మీకు గుడ్ న్యూస్. అప్లికేషన్ సమయంలో డిపాజిట్‌గా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు తిరిగి దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఈ రిఫండ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుందని హౌసింగ్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లై చేసే సమయంలో ప్రతి ఒక్కరి నుంచి రూ.10 వేల చొప్పున ధరావతు మొత్తాన్ని తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దరఖాస్తులను వివిధ శాఖల రికార్డులతో క్రాస్ చెక్ చేసిన అధికారులు అర్హత లేని దరఖాస్తులను గుర్తించారు. హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రెవెన్యూ, రవాణా, జీహెచ్ఎంసీ తదితర శాఖల నుంచి సేకరించిన వివరాలతో అధికారులు వెరిఫై చేశారు. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా 360 డిగ్రీల తనిఖీ చేపట్టిన హౌసింగ్ బోర్డు తొలి దశలోనే సుమారు 40 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించింది. దీంతో అర్హత సాధించని వారికి వారు ముందుగా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అప్లికేషన్ సమయంలో తమ మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనే మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపికైన లబ్ధిదారులు తమ దరఖాస్తు నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి అప్లికేషన్‌లోకి వెళ్లి వివరాలను మార్చుకోవచ్చు. మరోవైపు హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5,500 కుటుంబాలను అధికారులు నేరుగా పరిశీలించినట్లు సమాచారం. లబ్ధిదారుల వివరాలు, అర్హత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో చెక్ చేస్తున్న అధికారులు సర్వేను మరో రెండు రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది జాబితాను సిద్ధం చేసి హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అంటే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ముందుకు వెళ్లనుండగా, అర్హత సాధించని దరఖాస్తుదారులకు మాత్రం వారి రూ.10 వేల డిపాజిట్ తిరిగి రానుంది.

## ట్రాక్టర్లపై అసెంబ్లీకి వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు

**మొదటిపేజీ తరువాయి**

నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు బీజేపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ట్రాక్టర్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతుల పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ విధానంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగడుతూ ఈ వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టారు. ఈ ర్యాలీకి బీజేపీ శాసనసభా పక్ష నేతలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు నేతృత్వం వహించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న వేళ, రైతుల సమస్యలను సభ దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ బయట ట్రాక్టర్లపై ఎక్కి నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్లారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఫసల్ బీమా యోజన ద్వారా వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యేల ట్రాక్టర్లను అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు పొరుగు రాష్ట్రాలు ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేస్తూ రైతులను ఆదుకుంటుంటే తెలంగాణలో మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర పథకాన్ని పక్కనబెడుతున్నారని మండిపడ్డారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏటా వేలాది మంది రైతులు పంటలు నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ.500 బోనస్, పంటల భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ఫసల్ బీమా యోజనలో రాష్ట్ర వాటాను చెల్లించి తక్షణమే ప్రీమియం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంట నష్టపరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయాలని, లేకపోతే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల హక్కుల కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఫసల్ బీమా యోజన అమలే కాక రైతు రుణమాఫీ అరకొరగా అమలు చేయడంపై, రైతుబంధు జమ కాలేదనే అంశాలపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ట్రాక్టర్ల ర్యాలీతో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడగా పోలీసులు నిరసనకారులను సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

## సమగ్ర నివేదికలు సమర్పించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :**

అసెంబ్లీ వద్ద జరిగిన రెండు సంఘటనలకు సంబంధించి దాఖలైన ఫిర్యాదులపై నివేదికలు సమర్పించాలని చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలోని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచఆర్‌సీ) డీజీపీకి ఉత్తర్వులు జారీ చేసింది. బీఆరఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మీడియా సమక్షంలో అసభ్య పదజాలంతో దూషించారని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ఇతరులు ఆరోపించారు. అలాగే, దళితులు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు చెందిన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ఎదుట నిరసన నిర్వహించిన సమయంలో బీఆరఎస్ నాయకురాలిగా పేర్కొన్న పావని గౌడ్, ఇతరులు పసుపు నీరు, పాలు చల్లి ఆ ప్రాంతాన్ని 'శుద్ధి' చేసినట్లు, దళిత నిరసనకారులను అవమానకర పదజాలంతో దూషించినట్లు ఆరోపించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు. అలాగే శాసనసభ ప్రాంగణంలో జరిగిన నిరసన కార్యక్రమంలో కొంతమంది బీఆరఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీ షర్టులు తొలగించి మహిళా పోలీసు సిబ్బంది సమక్షంలో అర్ధనగ్నంగా నిలబడినట్లు ఇందిరా శోభన్ ఫిర్యాదు చేశారు. ఈ ప్రవర్తన మహిళా పోలీసు సిబ్బందికి ఇబ్బంది, మానసిక వేదన, అవమానాన్ని కలిగించడంతోపాటు వారి గౌరవం, భద్రతపై ప్రభావం చూపిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీటీవీ, ఇతర వీడియో దృశ్యాలను పరిశీలించి బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రికార్డులో ఉన్న అంశాలను పరిశీలించిన అనంతరం రెండు కేసుల్లోనూ డీజీపీ నుంచి నివేదికలు కోరుతూ చైర్‌పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. రెండు కేసులను వచ్చే నెల 9కు వాయిదా వేశారు.




# విద్యా రంగంలో సంస్కరణల హోరు

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ తెలిపారు.

**55 రోజుల్లోనే 10,006 టీచర్ పోస్టుల భర్తీ**

తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే కేవలం 55 రోజుల్లోనే మెగా డీఎస్సీ ద్వారా ఎలాంటి వివాదాలు, ఆరోపణలు లేకుండా 10,006 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం చెప్పారు. పదేళ్లలో గత ప్రభుత్వం 7,857 మంది టీచర్లను మాత్రమే నియమించిందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను కూడా పారదర్శకంగా పూర్తి చేశామన్నారు.

**పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నూతన వర్సిటీలు & కోర్సులు**

యువతను 'రెడీ టూ వర్క్‌ఫోర్స్'గా మార్చేందుకు ప్రత్యేక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, క్రీడల ప్రోత్సాహానికి 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ప్రారంభించాం. డిగ్రీ, ఇంజినీరింగ్ స్థాయిల్లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కోర్సులను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చెప్పారు. రూ.21,000 కోట్లతో 105 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్', 104 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్మాణం చేపడుతున్నాం. కోఠి ఉమెన్స్ కాలేజీని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మార్చి రూ.500 కోట్లు కేటాయించామని చెప్పారు. టీసీఎస్ భాగస్వామ్యంతో 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాం.. విద్యారంగంలో సమగ్ర మార్పులు తీసుకొచ్చేందుకు విద్యా కమిషన్ నివేదికపై కేశవరావు (కేకే) నేతృత్వంలోని కమిటీ పరిశీలన చేస్తోందని, ప్రతిపక్ష సభ్యుల సానుకూల సూచనలను స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం : మంత్రి దుద్దిళ్ల**

తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుతోపాటు విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రెండున్నరేళ్ల వ్యవధిలో విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి విద్యపై శాసనసభలో జరిగిన చర్చలో తెలిపారు. ప్రభుత్వపరంగా ప్రీ ప్రైమరీ సెక్షన్లను కూడా ప్రారంభించామన్నారు. చాలా ఏళ్ల తర్వాత అకడమిక్ కరిక్యులంలో మార్పులు చేర్పులు చేశామన్నారు. చదువుకుంటూనే విద్యార్థులు సంపాదించేలా ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించే ఏర్పాట్లు చేశామన్నారు.. బీఎఫఎసఐ(బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్) కన్సార్టియం సహకారంతో దేశంలోనే తొలిసారిగా డిగ్రీ, ఇంజినీరింగ్‌లో కోర్సులకు శ్రీకారం చుట్టామని, మనల్ని చూసి బీఎఫఎసఐ తరహా కోర్సులను కర్ణాటక, తమిళనాడు లాంటి అనేక రాష్ట్రాల్లో ప్రారంభించారని ఆయన చెప్పారు. టీ హబ్ తరహాలోనే వరంగల్‌లో ఇంక్యుబేషన్ హబ్‌ను(కెహబ్) ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లోనూ ఈ తరహా ఇంక్యుబేషన్ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, వివిధ దేశాల్లో విజయవంతంగా అమలవుతున్న విద్యా సంస్కరణలను పరిశీలించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులను అక్కడికి పంపించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అన్ని విద్యా సంస్థలను డ్రగ్ ఫ్రీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రభుత్వం బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని, రూ.500 కోట్లతో 93 కేజీబీవీలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్‌గా అభివృద్ధి చేసే ప్రక్రియను ప్రారంభించామని వివరించారు. విద్యా వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లేలా అందరి సలహాలు, సూచనలను స్వీకరించి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందులో ఎలాంటి భేషజాలు లేవని మంత్రి చెప్పారు.

**ప్రభుత్వ బడుల్లో ప్రీ-ప్రైమరీ విద్య ప్రారంభం**

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తొలిసారిగా ప్రభుత్వ బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ (ప్రీ-ప్రైమరీ) సెక్షన్లను అందుబాటులోకి తెచ్చాం. ఈ ఏడాది 64 వేల మంది విద్యార్థులు ప్రీ-ప్రైమరీలో చేరారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 27 శాతం పెరిగి, కొత్తగా 86 వేల మంది విద్యార్థులు చేరారు. ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులతోపాటు పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించాం.

# మత్స్యకారుల బతుకులకు భరోసా

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

చెరువుల పూర్తి నీటిమట్టం——ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆయన శాసన మండలి వేదికగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్యకారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందన్నారు. శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, జలవనరులు ఆక్రమణలకు గురైనా, వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. సభ దృష్టికి తీసుకొచ్చిన నిర్దిష్ట సమస్యను నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లోగా సంబంధిత చెరువును సందర్శించి, జలవనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, స్థానిక మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు పైగా పెరిగిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా సంఘాల సభ్యత్వం సుమారు రెండు లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని వివరించారు. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణలో మత్స్య సహకార సంఘాలకు మరింత క్రియాశీలమైన పాత్ర కల్పిస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలని సభ్యులు కోరారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జలవనరుల సమర్థ నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ఆక్రమణల నిరోధానికి కమిటీల వ్యవస్థను పునరుద్ధరించాలని వచ్చిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. చెరువుల పరిరక్షణకు అదనపు నిధులు అవసరమైతే వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి మండలి సాక్షిగా విస్పష్టమైన హామీ ఇచ్చారు. నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిందని చెప్పారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించుకున్న గడువులోగా రెండు దశలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ 2027 నాటికి నీరందించి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామన్నారుప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు.శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తోపాటు పలువురు సభ్యులు చేసిన సూచనలపై మంత్రి స్పందించారు. పీడీఎస్ పరిధిలోకి అదనపు సరుకులను తీసుకురావడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందుకు అవసరమయ్యే ఆర్థిక భారాన్ని సమగ్రంగా అంచనా వేస్తున్నామని తెలిపారు.

# ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

ఓబీసీలకు సంబంధించిన ఈ అంశంపై సభలో ఏకగ్రీవ తీర్మానం చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భవిష్యత్తు తరాలకు సంబంధించిన ఈ ముఖ్యమైన అంశంపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వున్న నేపథ్యంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెడుతున్నామ న్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన సభ్యులు కూడా బీసీల సమస్యలపై శాసనసభ ఏకగ్రీవంగా తీసుకునే నిర్ణయానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా ఓబీసీల జనాభా గణాంకాలు కచ్చితంగా ఉండాల్సిన అవసరం ఉంది. కుల ఆధారిత జన గణన ఎందుకు అవసరమో అందరూ అర్థం చేసు కోవాలి. బీసీల సామాజిక న్యాయం, విద్యా అవ కాశాలు, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కచ్చితమైన గణాంకాలు అవసరం. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక,ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ మరియు కుల సర్వే ద్వారా రాష్ట్రంలోని బీసీల వాస్తవ పరిస్థితిని గుర్తించే ప్రయత్నం చేసింది. ఆ సర్వే ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన జనగణనలో ఓబీసీలకు స్పష్టమైన ప్రత్యేక గుర్తింపు ఇవ్వకుండా ఓపెన్ కాలమ్ విధానం పెట్టడం వల్ల కచ్చితమైన ఓబీసీ గణాంకాలు సేకరించడం కష్టమైంది. కులాల పేర్లు, వివరాలు స్పష్టంగా నమోదు చేయకపోవడం వల్ల ఓబీసీల వాస్తవ జనాభా, వారి అవసరాలను అంచనా వేయడంలో సమస్యలు ఏర్పడ్డాయి. తెలంగాణలో ముందుగానే కులాల జాబితాలను రూపొందించి సర్వే నిర్వహించడం వల్ల కచ్చితమైన గణాంకాలు సేకరించడం సాధ్యమైంది. కేకేంద్ర జనగ ణనలో ఓబీసీలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ప్రత్యేక గుర్తింపు కల్పించాలి. జనగణన షెడ్యూల్లో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ను ఏర్పాటు. చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక రికార్డుల్లో ఉన్న కులాల వివరాలను డిజిటల్ పోర్టల్లో నమోదు చేయాలి. కచ్చితమైన కుల గణాంకాల ఆధారంగా సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు, ఉద్యోగాలు, రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలి. దేశవ్యా ప్తంగా బీసీలకు న్యాయం జరిగేలా కుల గణనను శాస్త్రీయంగా, పారదర్శ కంగా నిర్వహించాలి. ఈ అంశాలన్నింటిపై శాసనసభ ఏకగ్రీ వంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. కచ్చితమైన బీసీ గణాంకాలు ఉంటేనే సామాజిక న్యాయం కోసం సరైన విధానాలను రూపొందించడం సాధ్యమవుతుంది. సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవా లిన అవసరం ఉంది.

# జనగణనలో కులగణనను చేర్చాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :**

దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీనవర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా వద్దా అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో సర్వేను అసెంబ్లీలోనే అభినందించి ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేను దేశానికి ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై శుక్రవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేరుస్తామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీనవర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కుల గణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.

**రాష్ట్ర సర్వే దేశానికే ఆదర్శం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తు చేశారు.

**దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి**

తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతోపాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలోని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు.

**కులగణన ఒక 'ఎక్స్‌రే'**

సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. ఈ అసమానతలను తొలగించాలంటే ముందుగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉందన్నారు. 'సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన' అని భట్టి అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని, ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిర్వహించిన తరహాలో రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. కాగా, జన గణన2027 రెండో దశ ప్రశ్నావళిలో బీసీ/ఓబీసీలను చేర్చాలనీ శాసన సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది.

# కాలనీలకు కాలనీలే 22ఎ కిందకు పోయినయ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

అసిఫాబాద్ జిల్లా నుంచి హైదరాబాద్ వరకు ఎవరి నోట విన్నా 22ఏనే. అన్ని జిల్లాల్లో ఈ సమస్య ఉందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. దీనిపై తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరిస్తూ, 1908లో బ్రిటిష్ గవర్నమెంటులో 22ఏ ప్రకారం భూములను నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉందని ఇందులో దేవాదాయ, వక్ఫ్, భూదాన్, ప్రభుత్వ, పోరంబోకు, అసైన్డ్ భూములను ఎవరూ ఆక్రమించకుండా ఉండడం దీని ఉద్దేశమన్నారు. ప్రస్తుతం మనం 22ఏ1ఎ గవర్నమెంటు, పోరంబోకు, 22ఏ1బి పేదలకు పంచిన అసైన్డ్ భూములు, 22ఏ1సి దేవాదాయ, వక్ఫ్, 22ఏ1డి సీలింగ్ యాక్ట్ ద్వారా పొంది భూములు...ఇట్ల ప్రభుత్వ అవసరాలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా పెట్టుకున్నామన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఒక్కో ఊర్లో కాలనీలకు కాలనీలే 22ఏ కిందికిపోయిన్.. ఒక్కో కాలనీలో 2 వేల ఇండ్లు, 5 వేల ఇండ్లు ఇందులోకి పోయాయి. మరి గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు ఇప్పుడెందుకు జరగట్లేదని ప్రశ్నించారు. తెలంగాణలో భూమిపై హక్కులున్న మనుషులు ఈ ప్రభుత్వం మీద విశ్వాసం కోల్పోతున్నారన్నారు. రాత్రికిరాత్రి ఒక్క చిన్న గీతతో ప్రజల భూముల హక్కును తీసేసిండు.. ఆ ఆస్తుల విలువను జీరో చేసిండన్నారు. గతంలో హైడ్రా, ప్రస్తుతం 22ఏ... ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. పొంగులేటి, రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారులు. కానీ మీరు ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నరు. భూమి అనేది ప్రజల హక్కు అనే సోయిని మర్చిపోవద్దని, లక్షల మంది ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. 22ఎ వల్ల పిల్లల చదువులు, పెళ్లిల్లు ఆగిపోతున్నయ్.. నల్లగొండ జిల్లాలో ఓ పెళ్లి ఇలా ఆగిపోతే ఊరోళ్లంత కలిసి పెళ్లి చేసిన సంగతి గుర్తుచేశారు. హెచ్సీయూలో 400 ఎకరాల భూమిని గవర్నమెంటు కబ్జా పెట్టే ప్రయత్నం చేసింది.. విద్యార్థులు పోరాడి కాపాడుకున్నరు. కానీ ఆ 400 ఎకరాలు బాంబే స్టాక్ ఎక్చేంజ్‌లో కుదవ పెట్టి 9.5 శాతం వడ్డీకి 10 వేల కోట్ల అప్పు తీసుకున్నారు. ఇందులో బ్రోకర్‌కు 200 కోట్ల లంచం ఇచ్చారని ఆరోపించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో 8 వేల ఎకరాలను హెచ్ఎండీఏ ద్వారా బాంబే స్టాక్ ఎక్చేంజ్ 10 వేల కోట్ల అప్పు తీసుకున్నారు. ఉర్దూయూనివర్సిటీ భూములను సూట్ పెట్టారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాలు తీసుకున్నరు. లగచర్లలో భూములు రేవంత్ తన అల్లుడికి కట్టబెట్టిండని ఆరోపించారు. 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ భూములను తనఖా పెట్టి లోన్లు తీసుకురావడానికి స్కిల్ యూనివర్సిటీ తీసుకొస్తున్నారు. హిల్ట్ పీ పాలసీలో కూడా అంతే.. ఆ భూములను కొల్లగొట్టడానికి ప్రయత్నం తప్ప మరోటి కాదన్నారు. హైడ్రా వెనక ఉన్నదీ అదే.. బడా బాబుల ఇండ్లు కనపడవు.. రేవంత్ రెడ్డి తమ్ముడి ఇల్లు కనపడవు.. మూసీ వెనక కూడా అదే ఉంది.. మూసీ వెంట ఎస్టీపీలను పూర్తి చేస్తే అయిపోతది. 3 వేల ఎకరాల రియల్ ఎస్టేట్ వ్యాపారం. మెట్రో నిర్ణయం ద్వారా 280 ఎకరాల భూమి ఎల్ఎన్టీ నుంచి తీసుకోవాలి. ఇట్ల ఏంచేసినా భూమే.. 22ఏ వెనక కూడా భూమే ఉందన్నారు. ప్రజలు ఓపెన్‌గా 30 పర్సెంట్ గవర్నమెంట్.. అని చెప్తున్నరు..ఊర్లకు ఊర్లు.. ఇండ్లు, ప్రజల ఆస్తులు, అపార్టుమెంట్లు అన్ని ఇందులో పెట్టారన్నారు. రాత్రి నీదైన భూమి, పొద్దున కాదు. ఆలేరు ఎమ్మెల్యే దగ్గరికి పోతే ఇంట్ల ఉంటున్నవ్ కదా పో అంటున్నడు. మరి అమ్ముకోవాలంటే ఏంది పరిస్థితి. సంగారెడ్డిలో ఓ సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌కు తాత నుంచి ఆస్తి వచ్చింది. ఆ స్థలంలో పాత ఇల్లు కూలకొట్టి బ్యాంకు లోను కోసం పోతే 40 లక్షలు సాంక్షన్ అయ్యింది. తర్వాత మున్సిపల్ ఆఫీసుకు డిజైన్ అప్రూవ్ చేసుకోవడానికి పోతే నిషేధిత భూమి అన్నరు. ఇల్లు లేదిప్పుడు.. రోడ్డున పడ్డడు. ప్రొటెక్షన్ ఆఫ్ ప్రాపర్టీ రైట్స్ అనేది ప్రభుత్వం కనీసం ధర్మం. కానీ రెవెన్యూ మంత్రి, ముఖ్యమంత్రి ప్రజలు పాడైనా పర్వాలేదు మా ఆస్తులు పెరగాలి అనేది కోరుకున్నరు. కొమురం భీం జిల్లా నుంచి మల్లయ్య అనే కుటుంబం వచ్చింది.. ఆయన కేసీఆర్‌కు ఓటేయక తప్పు చేసిన అంటుండు. ఆయనకున్న 9 ఎకాలు ముగ్గురు కొడుకులకు 3 ఎకరాలు చేద్దామనుకుండు కానీ చేతల పాసుబుక్కున్నా అమ్ముకునే హక్కు లేదు. లక్షల కుటుంబాల అవస్థ ఇది. ప్రభుత్వం ఏమంటుంది.. కొత్తగా 22ఏలో పెట్టలేదు.. ధరణి నుంచి ఉన్నవే అంటది. ఇది పచ్చి అబద్ధం.. సారీ చెప్పడం కాదు.. రిజైన్ చేయాలి.. నీకా అర్హత లేదు.మరి అప్పుడు రిజిస్ట్రేషన్లే అయినయ్ ఈ 9 నెలల నుంచి సమస్య అని రాష్ట్రమంతా కూస్తుంటే ఇంకా బీఆర్ఎస్ మీద పడి ఏడుస్తరా? ఇట్లనే కాలం వెల్లదీస్తరా అని ప్రశ్నించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు పంపిన నిషేధిత జాబితాలకు సంబంధించిన లేఖలు అన్ని మీ ముందు ఉంచుతున్నాం.

ఇందులో ఆసిఫాబాద్ ప్రత్యేకం. ఎందుకంటే సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాలు, పేద రైతులు. వాళ్లకు ఏం తెలుసు ఏ అధికారి దగ్గరకు పోవాలి. మంచిర్యాలలో 11 వేల ఎకరాలు ఇట్ల దారుణం. కలెక్టర్లు ఆధారాలతో సహా నిరూపించినం చీము నెత్తురు ఉంటే పొంగులేటి రాజీనామా చేయాలి. ఇవన్నీ అసెంబ్లీలో పెడితే తలకాయ ఏడపెట్టాల్నో తెలవక మమ్మల్ని సస్పెండ్ చేశారు. 22ఏ అనేది ప్రభుత్వ భూముల కాపాడడానికి. భూభారతి పోర్టల్లో వక్ఫ్ భూముల వివరాలు లేవు.. దేవాదాయ భూములు లేవు.. అసైన్డ్ భూముల వివరాలు లేవు..మరి దేని కోసం మీరు 22ఏ తెచ్చిర్రు? ధ రణిలో ఈ వివరాలన్నీ ఉండె.. అంటే దీని వెనక ఏదో కుట్ర ఉందన్నారు. కానీ ప్రైవేటు భూముల్నిపెట్టిర్రు.. కష్టపడికొనుక్కున్న భూములను పెట్టిర్రు. కలెక్టర్ల మెడమీద కత్తి పట్టి 15 రోజుల్ల లిస్టు పంపాలని ఒత్తిడి చేయడంతో..అది సాధ్యం కాక.. ఆ ఒత్తిడి భరించలేక పాత డేట్ల బంజారీహిల్స్, జూబ్లీహిల్స్, నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వమే అమ్మిన భూములను కూడా ఇందులో పెట్టిర్రు.. షేక్ పేట్ లాంటి ఊరికి ఊరినే 22ఏలో పడింది. పద్ధతిపాడు లేకుండా.. వెరిఫికేషన్ లేదు బాధ్యత లేదు.. దీన్ని చూస్తే ఓ పథకం ప్రకారం వీటిని నిషేధిత జాబితాలో పెట్టినట్లు తెలుస్తుంది. మేడ్చల్‌లో 100 ఎకరాలు నిషేధిత జాబితాలో.. ఇందులో 5 వేల కుటుంబాలు నివసిస్తున్నయ్. అమీన్పూర్.. 1500 ఎకరాలు 22ఏలో.. అందులో ఇండ్లు, అపార్టుమెంట్లు 50 వేల ఉన్నయ్. వీళ్లంతా ఆగమయ్యారన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, కొమురంభీంలో నేను లేపలేనన్ని అప్లికేషన్లు వచ్చినయ్. 10 వేల దరఖాస్తులు.. అసెంబ్లీలో పొంగులేటి టేబుల్ మీద పెట్టి నిలదీద్దాం అనుకున్నం. కానీ మమ్మల్ని సస్పెండ్ చేష్రు.. అయినా ఇడిషిపెట్టం.. కచ్చితంగా బీఆర్ఎస్ దీని మీద పోరాడతది. భూదాన్ 20 ఎకరాలు ఉంటే ఊరిని మొత్తం 22ఎలో పెట్టారు. కరీంనగర్ రేకుర్తి.. పొన్నం, పొంగులేటి, కేంద్రమంత్రిని కలిసినా తీస్తలేదు.. అంటే ప్రభుత్వానికి తెలవక కాదు.. 30శాతం వసూలు చేయాలనేది అసలు లక్ష్యం. కలెక్టర్ గ్రీవెన్స్2కు రాట్లేదు.. టోల్ ఫ్రీ లేవట్టె టోడే లేదు. ఎమ్మార్వోను కలవమంటున్నరు.. ప్రజలను ఆడుకుంటున్నరు. హౌసింగ్ సొసైటీలకిచ్చిన భూములు 22ఏలో పడ్డయ్. జూబ్లిహిల్స్ హౌసింగ్ సొసైటీ భూములు కూడా 22ఏ పడ్డయ్.. రేవంత్ రెడ్డి ఇల్లు కూడా అండ్ల పడ్డది. దాన్ని తెల్లారేసరికి తీసేశారు మరి ప్రజల భూముల్ని కూడా అట్ల తీసేయక ఎందుకు ఇబ్బంది పెడుతున్నవని ప్రశ్నించారు. సింఫొనీ కాలనీ.. 4 వేల కుటుంబాలు.. ఆగమాగమయ్యాయి. పొంగులేటి తప్పు చేసి అధికారుల మీద రుద్దడమేంది? 33 జిల్లాల కలెక్టర్లు ఎందుకు తప్పు చేస్తరు.. తప్పు నీది.. మరెందుకు ఒక్క అధికారి మీద కూడా చర్య తీసుకోలేదు.. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా గవర్నమెంటే తొలగించాలి..దీన్ని పబ్లిక్ డొమైన్లో పెట్టాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 4 నెలల కిందనే యాదాద్రి జిల్లాలలో 40 వేల ఎకరాలు పెట్టినట్లు రేవంత్ రెడ్డికి చెప్పిన అని తెలిపిండు. మరి అప్పటి నుంచి ఎందుకు రివ్యూ చేయలేదు. సో ఇద్దరి డైరెక్షన్లో జరిగింది. 22ఏను అడ్డంపెట్టుకుని ఏ రకంగా స్కామ్స్ చేస్తున్నరో కూడా చూడొచ్చు. నాదర్గుల్ స్కాం అలాంటిదే.. దీన్ని బీఆర్ఎస్ బయటపెట్టింది. రెవెన్యూ మంత్రి కొడుకు హర్షారెడ్డి డైరెక్టర్‌గా ఉన్న కంపెనీకి 373 ఎకరాల భూములను ధారాదత్తం చేసే ప్రయత్నం చేస్తున్నరు.

అంతే కాదు సబితక్క నియోజకవర్గం మహేశ్వరం నుంచి రైతులొచ్చిర్రు.. మా తాత ముత్తాతల నుంచి వస్తున్న భూముల్లోకి పోనీయట్లేదు. అక్కడున్న గుట్టలకు క్షషర్లు పెట్టిర్రు.. ప్రవేటు సైన్యమొచ్చింది.. రేకులు అడ్డంపెడుతున్నరు. చెరువులు, చెరువుల్లోకి నీళ్లు పోయే కాలువలు ధ్వంసం, గుట్టలు ధ్వంసం అవుతున్నయ్.. అయినా ప్రభుత్వం పట్టించుకోట్లేదు. ఏక్యూస్వేయర్ కోహినూర్ గ్రూప్ అగ్రికల్చర్ సీలింగ్ ల్యాండ్‌ను రిజిస్టర్ చేసుకున్నరు. సీలింగ్ ల్యాండ్‌లో సీలింగ్ డిసైడ్ అయ్యేదాక గవర్నమెంటు ఆధీనంలో ఉండాలి..కానీ సీలింగ్ డిక్లెయిర్ కాకుండా ఆర్డీవో చేతిలో ఉండాల్సిన భూమి.. క్రిస్టల్ మాన్షన్ డైరెక్టర్.. క్రిస్టల్ మాన్యషన్‌లో హర్షారెడ్డి డైరెక్టర్, శిల్పా ఇన్ఫ్రా ఇందులో కూడా డైరెక్టర్ సింగిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. హర్షారెడ్డి డైరెక్టర్లు. అంటే ఇట్ల సీలింగ్ భూములను కూడా కబ్జా చేస్తున్నరు. బీఆర్ఎస్ పార్టీ ఈ విషయాన్నీ బయటకు తీసింది.. ఏప్రిల్ 5న ప్రెస్మీట్ పెట్టి 10న మన ఎమ్మెల్యేలు కలెక్టర్ నారాయణ రెడ్డికి కంప్లైంట్ చేసిర్రు. దాంతో ఏప్రిల్ 12న బోర్డు తీసేష్రు.. కానీ సెప్టెంబరులో మళ్లీ కోహినూర్ బోర్డు వచ్చింది. దీని వ్యాల్యూ 10 వేల కోట్ల రూపాయలు.భూభారతిలో కూడా ఇది గవర్నమెంటు ల్యాండ్ అనేదే ఉంది.. ఫిజికల్‌గ పోతే ప్రైవేటు చేతిలో ఉంది. గవర్నమెంటే రిజిస్ట్రేషన్ చేస్తుంది.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా దాన్ని ప్రైవేటు ల్యాండ్ అంటున్నడు. కానీ ఆర్డీవో మార్చి 17, 2025న సుప్రీం కోర్టులో ఆ ల్యాండ్ గవర్నమెంటుదే అని సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేసిండు. అయినా ఆర్డీవో కానీ, రంగనాథ్ కానీ ఆ భూమి దగ్గరకు పోరు.. దాన్ని హ్యాండోవర్ చేసుకోరు. ఇదంతా పొంగులేటి అరాచకం.. అనుముల తిరుపతి రెడ్డి కూడా తక్కువేం కాదు. రేవంత్ రెడ్డి తమ్ముడి విషయం 1967లో లక్ష్మీ నారాయణ లీలాబాయికి, తర్వాత చెట్టిలింగంకు అమ్మేశారు..నుంచి 1985 వరకు ఇద్దరి చేతులు మారింది. పసుమాములు, విలేజ్ అబ్దుల్లాపూర్ మెట్ మండలం. కానీ 1967లో అమ్మిన వ్యక్తి మనుమడిని పట్టుకుని సేల్ డీడ్ చేసుకున్నడు తిరుపతి రెడ్డి. దీని మీద బీఆర్ఎస్ గవర్నమెంటు ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లా కోర్టులో ఓడిపోయారు. నాలా కన్వర్షన్లు, పట్టా పాసుపుస్తకాల కోసం పోయినా కానీ కాంగ్రెస్ గవర్నమెంటు వచ్చిన 5 నెలల్లో ఆ భూమికి పాస్ బుస్కులొచ్చినయ్ నాలా కన్వర్షన్2కు అప్లై చేశారు. కానీ అప్పటికే ప్లాట్లు అయ్యి ఇండ్లు కూడా కట్టుకున్న భూమిని దాని మీద ఉన్న కేసులను చూడకుండా నాలా కన్వర్షన్ ఇచ్చారు. మే 2024ల ఓపెన్‌గా కబ్జా పెడుతున్నరు.. ఇప్పుడు ఇండ్లు కట్టుకున్నోళ్లతో సెటిల్మెంట్లకు దిగుతుర్రు. విట్టల రాధ ఆమె క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది.. ఆమెకు గజ్వేల్‌లో 2 ఎకరాల 10 గుంటల భూమి ఉంది. ఆమె భర్త బాలకృష్ణ నుంచి ఆమెకు వచ్చింది.. ఎవరైనా భూమిని అమ్మాలంటే స్లాట్ బుక్ చేసుకుని. థంబ్ వేసి అమ్మడం కానీ కొనడం కానీ జరగదు.. కానీ అసలు ఆమె ప్రమేయం లేకుండా ఆమె భూమి సాధు నర్సమ్మ అనే పేరు మీదికి పోయింది. సాధు నర్సమ్మ తన కొడుకు లివాన్ రెడ్డికి ఆగస్టు 13న ఎకరా 5 గుంటలు రిజిస్ట్రేషన్ చేసింది. 14న కూతరు వంగ స్వప్నకు ఎకరా 5 గుంటలు చేసింది. అంటే రాధ భూమి రాధకు తెలవకుండా వేరే వాళ్ల మీదకు పోయింది. వాళ్లు ఎమ్మార్వోకు కంప్లైంట్ చేస్తే సారీ చెప్పిండు.. దాంతో కలెక్టర్ దగ్గరకు పోయిర్రు.

అక్కడ కంప్లైంట్ తీసుకుని సరిచేస్తమని చెప్పిర్రు.. అంటే ఇట్ల వందల వేల కోట్ల విలువైన భూములు భూభారతి వల్ల ఒకరి ఆస్తులు ఇంకొకరి పేరు మీదికి పోతున్నయ్. అంటే వీళ్లు తీవ్రంగా కష్టపడి తెచ్చిన భూభారతి చేస్తున్న అద్భుతాలివి. డైమండ్ హిల్స్.. గవర్నమెంటు ప్రొహిబిటెడ్ లిస్టులో ఉంది.. సుప్రీం కోర్టులో కేసు ఉంది. కానీ ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ అయ్యింది. ఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాళ్లు అప్లికేషన్లు పెట్టినా పట్టించుకునే అధికారులు లేరు. ఇబ్రహింపట్నం మండలం రాందాస్ పల్లిలో 400 ఎకరాల పట్టా భూమి ఉంది. దీంట్లో 40 ఏండ్ల కిందట గవర్నమెంటు 100 ఎకరాలు కొనుక్కొని వెట్టి కార్మికులకు పంచింది.ఆ వంద ఎకరాలను ప్రొహిబిటెడ్ ల్యాండ్‌లో పెట్టకుండా మిగిలిన 300 ఎకరాలు ప్రొహిబిటెడ్ ల్యాండ్‌లో పెట్టిర్రు. ఆర్డీవో కూడా దీన్ని పొరపాటున ప్రొహిబిటెడ్‌లో పెట్టిన అని చెప్పిండు అయినా దాన్ని తీయట్లేదు. ఈ రైతులు పొంగులేటిని కూడా కలిసిండు అయినా ప్రయోజనం లేదు. రాఘవ 18 ఫిబ్రవరి.. రాఘవ కన్‌స్ట్రక్షన్ కు టీజీఐఐసీ భూమి 19న రిజిస్ట్రేషన్. ఇది కూడా ప్రభుత్వ భూమే మరి వాళ్లకు అయిన భూమి మిగతా ప్రజలకు ఎందుకు కాట్లేదు. ఇంకా చాలా మంది బాధితులు ముందుకు రాట్లేదు.. ఇంకో రెండేండ్లు ఆగండి మీరే వస్తరు అప్పుడు అన్ని ఆధారాలు ఇస్తం అంటున్నరు. కొంపల్లిలో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నంక 22ఏలో పడ్డది.

దాంతో ఎమ్మార్వో, కలెక్టర్ ఆపైకి పోతే కమిషన్ తీసుకున్నారు. రావిరాల, గోపన్ పల్లి, బుద్వేల్, పుప్పలగూడ, పఠాన్ చెరులో శిల్పా మోహన్ రెడ్డి పేరుతో మస్తు అక్రమాలు జరుగుతున్నయ్ అవన్నీ సమయం వచ్చినప్పుడు ఆధారాలతో బయటపెడతం. ఖానామెట్ భూమి ప్రొహిబిషన్ లిస్టులో ఉంది. కానీ సెప్టెంబర్ 11న ఉదయం 9 గంటలకు అక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీన్ని రెవెన్యూ మినిస్టర్ రాఘవ, అపర్ణ అనే బోర్డు త్వరగా వెలిసే అవకాశం ఉంది. రాత్రిరాత్రి పేదల గుడిసెలు పడగొట్టే హైడ్రా ఇక్కడ ఎందుకు స్పందించదు? జనగాం చుట్టు పక్కల జిల్లాలోని ఆరేడు మండలాల్లో రైతులు కట్టిన చలానాలు రెవెన్యూ అధికారులు దొబ్బేసి అందులో పది శాతం కట్టి రిజిస్ట్రేషన్లు చేశారు. దీని మీద ఇప్పటికీ చార్జిషీట్ లేదు.. లోతైన పరిశోధన లేదు. గవర్నమెంటు ఆదాయం ఇంత పెద్ద ఎత్తున పోతే ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. ఇది భూభారతి కాదు.. భూహారతి.. భూభారతిని, 22ఏను అడ్డం పెట్టుకుని వేల కోట్ల ప్రజల ఆస్తులనుకొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నరు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెట్టిన భూములను పెట్టినట్లు 22ఏ నుంచి తొలగించాలి. జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి ఇల్లును ఎట్లయితే 22ఏ నుంచి రిలీజ్ చేష్రిరో ప్రజల ఆస్తులను కూడా అట్లనే రిలీజ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

---

## ఆయుధాల చోరీ కేసులో
# నలుగురి అరెస్ట్

- కేసు ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

---

## బీజేపీని పక్కకు నెట్టేసిన
# కాంగ్రెస్–బీఆర్ఎస్ పోరు

**మొదటిపేజీ తరువాయి**

గెలుచుకోవడం, బీఆర్ఎస్ ఓటు శాతం 16-18 శాతానికి పడిపోవడంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం తమకే ఉందని బీజేపీ భావించింది. అయితే ప్రస్తుత పరిణామాలు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీ లోపల, బయట కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్యే హోరాహోరీ రాజకీయ పోరు కొనసాగుతోంది. రేవంత్‌రెడ్డి వ్యూహాలు, బీఆర్ఎస్ నిరసనలు, అరెస్టులు, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన దర్యాప్తులే రాజకీయ చర్చను ఆక్రమిస్తున్నాయి.

**దూకుడుగా బీఆర్ఎస్**

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జాతీయ రాజకీయ అంశాల ప్రభావంతో వచ్చాయని, వాటిని రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ బలానికి కొలమానంగా చూడలేమనే అభిప్రాయం తాజా పరిణామాలతో బలపడుతోంది. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్, సంస్థాగత నిర్మాణం బీఆర్ఎస్‌కు ఇప్పటికీ ఉంది. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రభుత్వాన్ని నేరుగా ఢీకొంటోంది. ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళనలు చేపడుతూ కాంగ్రెస్‌తో రాజకీయంగా తలపడుతున్న తీరు బీఆర్ఎస్‌ను మరోసారి ప్రధాన ప్రతిపక్షంగా చర్చలోకి తీసుకొస్తోంది.

**బీజేపీకి దక్కని రాజకీయ స్థలం**

కాంగ్రెస్ వ్యూహం కూడా బీఆర్ఎస్‌ను ప్రధాన ప్రత్యర్థిగా నిలబెట్టే విధంగానే సాగుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి తరచూ కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, శాసనసభలో స్పీకర్ వ్యవహారం, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించిన ఆరోపణలు వంటి అంశాలతో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్యే రాజకీయ చర్చను పరిమితం చేయగలుగుతోంది. దీంతో కేసీఆర్‌కు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి రాజకీయ పోరాటం చేస్తున్నారనే నెరేటివ్ బలపడుతుండగా, బీజేపీకి మూడో రాజకీయ శక్తిగా నిలిచే అవకాశం తగ్గుతోంది.

**నాయకత్వ లోపంతో కమలం**

లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని ఆధారంగా చేసుకుని రాష్ట్ర రాజకీయాల్లో ముందుకు వెళ్లడం సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ గుర్తించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీలో ప్రజా సమస్యలను బలంగా ప్రస్తావించడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతర ఉద్యమాలను నిర్వహించడంలో పార్టీ వెనుకబడింది. బీజేపీ చేపడుతున్న నిరసనలు కూడా కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న తీవ్ర రాజకీయ పోరులో పెద్దగా ప్రభావం చూపడం లేదు.


పార్లమెంట్ ఎన్నికల తర్వాత వచ్చిన రాజకీయ మైలేజ్‌ను నిలబెట్టుకోవడంలో బీజేపీ విఫలమైతే ఆ పార్టీ సాధించిన ఎనిమిది లోక్‌సభ స్థానాల ప్రభావం క్రమంగా తగ్గిపోయే అవకాశం ఉంది. కాంగ్రెస్‌ను ఢీకొట్టగల ప్రధాన శక్తి బీఆర్ఎస్ మాత్రమే అనే భావన ప్రజల్లో మళ్లీ బలపడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఇది పెద్ద ప్రతికూలతగా మారే అవకాశం కనిపిస్తోంది.

---

## ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు
# రూ.180 కోట్లు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

ఎదురుచూస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు రూ.179.90 కోట్లు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను త విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నిధుల విడుదలతో విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న మొత్తం 3,008మందికి భారీ ఆర్థిక ఊరట లభించిందని, స్కాలర్‌షిప్ మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నిధుల కేటాయింపుల్లో భాగంగా ఎస్సీ వర్గానికి చెందిన 1,193మంది విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.48.42 కోట్లు విడుదలయ్యాయి. అలాగే ఎస్టీ వర్గానికి చెందిన 573మందికి రూ.36.95 కోట్లు, బీసీ సామాజికవర్గానికి చెందిన 179 మంది విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.18.41 కోట్లు మంజూరు చేశారు. మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన 1,063మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యా నిధి కింద రూ.76.13 కోట్లను విడుదల చేశారు. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా అంతర్జాతీయస్థాయి విశ్వవిద్యాలయాలలో ఉన్నత చదువులు అభ్యసించాలనే దృఢ సంకల్పంతోనే ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




---

# అటవీ శాఖ అమరుల సేవలు చిరస్మరణీయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :**

సహజ వనరులు, అటవీ సంపద, వన్యప్రాణుల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన అటవీ శాఖ సిబ్బంది సేవలు చిరస్మరణీయమని డీజీపీ¾ సి.వి.ఆనంద్ అన్నారు. అటవీ శాఖ పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్కులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. పర్యాటక, ఎక్సయిజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అడ్డుకునే క్రమంలో ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. అటవీ సిబ్బంది ఆయుధాలు ఇవ్వాలని కోరారు. ఎక్సైజ్ శాఖ తరఫున డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని జూపల్లి తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని, అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అడవుల నరికివేత, అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణాల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులను పర్యాటకంగా ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు.

**23మంది అటవీ సిబ్బంది ప్రాణత్యాగం : డీజీపీ**

రాజస్థాన్‌లోని ఖేజర్లీ ప్రాంతంలో చెట్లను, పర్యావరణాన్ని కాపాడేందుకు 1730 సంవత్సరంలో 363మంది విష్ణోయి తెగ ప్రజలు ప్రాణత్యాగం చేసిన ఘటనకు గుర్తుగా యేటా సెప్టెంబర్ 11న అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీపీ¾ తెలిపారు. ఈ రోజు ప్రత్యేకమని, ఇది భావోద్వేగంతో కూడిన రోజని అన్నారు. వన్యప్రాణులు, అడవుల సంరక్షణలో 23మంది అటవీశాఖ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 11న పాల్వంచలో ఎఫ్‌బీవో బానోతు నవీన్ వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని అటవీ, వన్య ప్రాణుల పరిరక్షణలో ప్రాణ త్యాగం చేశారంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అటవీ శాఖతో తనకు ఉన్న అనుబంధాన్ని డీజీపీ గుర్తు చేసుకున్నారు. తన తండ్రి 1953లో అటవీ శాఖలో రేంజ్ ఆఫీసర్‌గా చేరి 35 ఏళ్లపాటు సేవలందించి 1988లో డీఎఫ్‌వోగా పదవీ విరమణ చేశారని తెలిపారు. నక్సల్స్ ప్రభావం ఉన్న రోజుల్లో తన తండ్రి అటవీ శాఖలో పనిచేసేవారని, దీంతో ఫారెస్ట్ సిబ్బందితో అనుబంధం ఉందని చెప్పారు. ఆ తర్వాత 1996లో బెల్లంపల్లిలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో తల్లిదండ్రులతో కలిసి చెన్నూరు చెక్‌పోస్టుకు వెళ్లిన సం<ర్భంలో దట్టమైన అడవులు పూర్తిగా కనుమరుగవడాన్ని చూసి తన తల్లిదండ్రుల కళ్లలో నీళ్లు తిరిగాయని తెలిపారు.

**పర్యావరణ సమతుల్యతను కాపాడాలి**

అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీజీపీ పేర్కొంటూ మానవ తప్పిదాల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. హిమాలయాల్లో చోటుచేసుకున్న ప్రకృతి విపత్తులు, యూరప్‌లోని అడవుల్లో సంభవిస్తున్న అగ్నిప్రమాదాలు పర్యావరణ మార్పుల తీవ్రతను తెలియజేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకుని అడవులను పరిరక్షించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మిగిలి ఉన్న చిన్నచిన్న అటవీ ప్రాంతాలను కూడా భవిష్యత్ తరాల కోసం కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

**అటవీ సిబ్బందికి ఆయుధాలు**

గతంలో నక్సల్స్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించే సమయంలో అటవీ శాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉండేవి కావని డీజీపీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటవీ శాఖ సిబ్బందికి అవసరమైన ఆయుధాలు అందిస్తే వారు మరింత సమర్థంగా విధులు నిర్వర్తించగలరని అన్నారు. పోలీసు శాఖ తరఫున అటవీ శాఖకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు.

**ప్రాణాలకు తెగించి విధులు : వినయ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్**

అటవీ సిబ్బంది విధులు అత్యంత ప్రమాదకరమైనవని ఫారెస్ట్ చీఫ్ కన్సర్వేటర్ వినయ్‌కుమార్ అన్నారు. పెట్రోలింగ్ సమయంలో అక్రమ కలప రవాణాదారులు, వన్యప్రాణుల వేటగాళ్లు, ఇతర దుండగుల నుంచి సిబ్బందికి ప్రమాదం పొంచి ఉంటుందని తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో వేటగాళ్లను పట్టుకునే క్రమంలోనూ సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

కార్యక్రమంలో వైరా శాసనసభ సభ్యుడు రాందాస్ నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, టీజీఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ సునీత ఎం.భగవత్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, సెక్రటరీ ప్రియాంక వర్గీస్, పోలీసు, అటవీ శాఖ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విమోచన దినాన్ని కనుమరుగు చేస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటే నాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ గడ్డ మాత్రం ఆ వేడుకల్లో పాల్గొనే పరిస్థితి లేకుండా నిజాం రాచరిక సంకెళ్లలో, రజాకార్ల ఆగడాలకు గురై మరో 13 నెలల పాటు నరకయాతన అనుభవించిందని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ గుర్తుచేశారు. నేటి యువతరానికి, జెన్‌జీ, జెన్‌ఆల్ఫా తరాలకు దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందంటే ఆగస్టు 15 అని మాత్రమే తెలుసని, నాటి పరిస్థితుల్లో తెలంగాణ అందులో భాగస్వామి కాలేదన్న చేదు నిజాన్ని చాలామంది గ్రహించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన ఈ చారిత్రక ఘట్టాలు, రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. దేశం స్వతంత్రమైన వేళ హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో విలీనం చేయకుండా ఒక ప్రత్యేక దేశంగానో లేదా ఇస్లామిక్ రాజ్యంగానో మార్చాలని నిజాం కుట్రలు పన్నారని మండిపడ్డారు. ఖాసిం రజ్వీ నేతృత్వంలోని నిజాం ప్రైవేట్ సైన్యం రజాకార్లు దాదాపు 13 నెలల పాటు సాగించిన కిరాతక మారణకాండలో తెలంగాణ ప్రజలు తీవ్ర చిత్రహింసలు అనుభవించారని, ఈ చరిత్రను ఆనాటి కాంగ్రెస్ పార్టీ కాలగర్భంలో తొక్కివేసిందని ఆరోపించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో ముందుకొచ్చి దేశ కడుపులో ఏర్పడ 'క్యాన్సర్ కణితి'ని శస్త్రచికిత్స చేసి తొలగించాల్సిందేనని పట్టుబట్టి 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో'కు ఆదేశాలు ఇచ్చి భారత సైన్యాన్ని పంపించారని, సైన్యం ధాటికి తలొగ్గి సెప్టెంబర్ 17న నిజాం సైన్యం లొంగిపోయి సంస్థానాన్ని భారత్ లో విలీనం చేసిందని స్పష్టం చేశారు. హైదరాబాద్ సంస్థాన పరిధిలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక జిల్లాల్లో సెప్టెంబర్ 17ను అక్కడి ప్రభుత్వాలు అధికారికంగా విమోచన దినోత్సవంగా జరుపుతుంటే తెలంగాణలో మాత్రం ఎందుకు జరపడం లేదని ఆయన నిలదీశారు. అక్కడ లేని ఎంఐఎం ఇక్కడ ఉండటమే దీనికి ప్రధానా కారణమని ఆరోపించారు. మలిదశ ఉద్యమంలో నాటి రోశయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సెప్టెంబర్ 17 అధికారికంగా నిర్వహించకపోతే ప్రభుత్వాన్ని కుప్పకూలుస్తామని హెచ్చరించిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో తాను ప్రస్తావిస్తే ఊసరవెల్లిలా రంగులు మార్చి జరిపే ప్రసక్తే లేదు అని మడమ తిప్పారని విమర్శించారు. "కారు ప్రభుత్వం నడిపితే, స్టీరింగ్ నా చేతుల్లో ఉంది" అని ఆనాడు అసదుద్దీన్ ఒవైసీ మాటలను గుర్తుచేస్తూ.. మజ్లిస్ కు తొత్తులుగా మారి తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారికే కొమ్ముకాశారని విరుచుకుపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సైతం అదే బాటలో నడుస్తూ 'ప్రజాపాలన' పేరిట పేరిట విమోచన దినోత్సవ ప్రాధాన్యతను కనుమరుగు చేసి మైనారిటీల బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు.



# డిలిమిటేషన్ బిల్లుపై కేంద్రం కసరత్తు

- **మహిళా రిజర్వేషన్‌పైనా ప్రత్యేక సమావేశం?**
- **బ్రిక్స్ భేటీ తర్వాత నిర్ణయం వెలువడే అవకాశం**
- **నవరాత్రుల్లో పార్లమెంట్ సమావేశాలపై ఊహాగానాలు**
- **ప్రత్యేక సమావేశాలపై అధికారిక ప్రకటన లేని కేంద్రం**
- **వర్షాకాల సమావేశాల తీరుపై జైరాం రమేష్ విమర్శలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:**

నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ (డిలిమిటేషన్) బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను అధికారికంగా వాయిదా వేయకపోవడంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. అయితే దీనిపై కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

**బ్రిక్స్ భేటీ తర్వాత నిర్ణయం**

బ్రిక్స్ సమావేశాల అనంతరం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. నవరాత్రుల సమయంలో సమావేశాలు నిర్వహించే అవకాశంపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలా? వద్దా? అనే అంశంపై బ్రిక్స్ భేటీ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**జైరాం రమేష్ విమర్శలు**

వర్షాకాల సమావేశాలు ముగిసి 29 రోజులు గడిచినా పార్లమెంట్‌ను అధికారికంగా వాయిదా వేయకపోవడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ప్రశ్నించారు. ప్రభుత్వం తన సొంత రికార్డును తానే బద్ధలు కొడుతోందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాన్ని భయపెట్టాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తోందని, అయితే ఆ ప్రయత్నం ఫలించలేదని అన్నారు. ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. రోజుకు ఆరు గంటల చొప్పున 15 రోజులు సమావేశాలు జరగాల్సి ఉండగా.. లోక్‌సభ కేవలం 15 గంటల 36 నిమిషాలు, రాజ్యసభ 24 గంటల 21 నిమిషాలు మాత్రమే పనిచేశాయి. జంతర్‌మంతర్ నిరసనలు, విద్యార్థుల సమస్యలు, వారిపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్షాలు సభలో ఆందోళన చేపట్టాయి.

# ఫాస్టాగ్ బ్యాంక్ మార్చుకోవడం ఇక ఈజీ

- **పాత ట్యాగ్‌తోనే కొత్త ఖాతాకు అనుసంధానం**
- **'రాజమార్గయాత్ర' యాప్‌లో 'OneTag' సదుపాయం**
- **డీయాక్టివేట్ చేసి కొత్త ట్యాగ్ కొనాల్సిన అవసరం లేదు**
- **వాహనదారులకు మరింత సులభతరం కానున్న టోల్ చెల్లింపులు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:**

టోల్ ప్లాజాల వద్ద వాహనదారుల ప్రయాణాలను మరింత సులభతరం చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) ఫాస్టాగ్ బ్యాంక్ అకౌంట్ పోర్టబిలిటీ సదుపాయాన్ని ప్రారంభించింది. ఇకపై ఫాస్టాగ్‌ను డీయాక్టివేట్ చేయకుండానే అనుసంధానమైన బ్యాంక్ ఖాతాను మార్చుకునే వెసులుబాటు కలగనుంది. గతంలో బ్యాంక్ ఖాతాలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఖాతా మార్చుకోవాలనుకున్నా.. ఉన్న ఫాస్టాగ్‌ను డీయాక్టివేట్ చేసి, కొత్త బ్యాంక్ ద్వారా మరో ట్యాగ్ కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీంతో వాహనదారులకు సమయం, నగదు వృథా కావడంతో పాటు ఇబ్బందులు ఎదురయ్యేవి.

**'OneTag'తో డిజిటల్‌గా మార్పు**

ఎన్‌హెచ్ఏఐ అధికారిక 'రాజమార్గయాత్ర' (Rajmargyatra) మొబైల్ యాప్‌లోని 'OneTag' ఫీచర్ ద్వారా ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. వినియోగదారులు తమ పాత ఫాస్టాగ్‌ను యథాతథంగా ఉంచుకుంటూనే, నచ్చిన మరో బ్యాంక్ ఖాతాకు అనుసంధానించుకోవచ్చు. వాహనంపై ఉన్న స్టిక్కర్‌ను మార్చాల్సిన అవసరం లేకుండా కేవలం డిజిటల్ పద్ధతిలో బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పించారు.

# మా సమస్యలపైనే ఫిర్యాదు చేయాల్సి వచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై ప్రజాప్రతినిధులమని కూడా చూడకుండా తన గొంతు నులమగా, సహచర ఎమ్మెల్యే చీర లాగి అత్యంత అవమానానికి గురిచేశారని కన్నీటిపర్యంతమయ్యారు. అసెంబ్లీ ప్రాంగణంలో తమ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి, పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ ఢిల్లీ వేదికగా పోరును ముమ్మరం చేసింది. మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల దురుసు ప్రవర్తన, తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించడంపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహట్కర్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతరం జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతిని కలిసి ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, పోలీసుల చేత అవమానించడం, శాసనసభ్యులుగా తమ హక్కులకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం వంటి అంశాలను కమిషన్ల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల దాడులపై స్పందించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ ఫుటేజీలను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తగిన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. తక్షణం డీజీపీని నివేదిక కోరతామని మహిళా కమిషన్ చైర్ పర్సన్ హామీ ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమకు అవమానం జరిగిందని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలను దేశం మొత్తం గమనిస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు సమస్యలపై సభలో చర్చ జరగాలని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే సమావేశాల ప్రారంభ రోజునే తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించాక అసెంబ్లీలో అడుగుపెట్టకముందే పోలీసులు తమను నిలువరించారని చెప్పారు. నల్ల దుస్తులు ధరించడాన్ని కారణంగా చూపి అడ్డుకున్నారని, అయితే తమ దుస్తులపై ఎలాంటి అభ్యంతరకరమైన రాతలు లేవని స్పష్టం చేశారు. తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరు ఇచ్చారు అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా అవమానకరంగా ఉందని, చీర, జుట్టు పట్టుకుని లాగారని, ఇతర ఎమ్మెల్యేలను కింద పడేసి తొక్కారని ఆరోపించారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. 'మా మనసులు గాయపడ్డాయి.. భారమైన గుండెలతో మాట్లాడుతున్నాం.. మహిళలుగా మాకు అవమానం జరిగింది.. శాసనసభ్యులుగా మా హక్కులకు భంగం కలిగింది' అని సబిత ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడి జరిగి వంద గంటలు దాటినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆరోపించారు. మరోవైపు తమపైనే కేసులు నమోదు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ ఫిర్యాదు చేసినా న్యాయం జరగనందునే ఢిల్లీకి వచ్చామని తెలిపారు.

**మా సమస్యలపై ఫిర్యాదు చేయాల్సి వచ్చింది**

సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శాసనసభ్యులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును పూర్తి వివరాలతో జాతీయ కమిషన్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించాల్సిన తాము ఇప్పుడు తమపై జరిగిన దాడి గురించి మాట్లాడాల్సిన పరిస్థితి రావడం అత్యంత దారుణమని అన్నారు. 'ప్రజా సమస్యలపై మా గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు.. అందుకే మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు.. రాష్ట్రంలో న్యాయం జరగలేదని భావించి ఢిల్లీకి వచ్చాం' అని సునీత అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేయించి తిరిగి తమపైనే కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. తమకు జరిగిన అవమానంపై అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, స్పీకర్ స్పందించి ఉంటే ఆయనకు చేతులెత్తి నమస్కరించేవాళ్లమని అన్నారు.

**పథకం ప్రకారమే అడ్డుకున్నారు : జగదీశ్‌రెడ్డి**

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత జరుగుతున్న అప్రజాస్వామిక ఘటనలను రాష్ట్ర ప్రజలతోపాటు దేశం మొత్తం చూస్తోందన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ను శాసనసభకు రాకుండా పథకం ప్రకారం అడ్డుకున్నారని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధులపై దాడులు చేయించడం ద్వారా ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా వ్యవహరించారన్నారు. తమ ఎమ్మెల్యేలపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా తమపై కేసులు పెట్టారని ఆరోపించారు. ఎమర్జెన్సీ రోజులను తలపించేలా కాంగ్రెస్ ప్రభుత్వ నైజం బయటపడుతోందని ఆయన విమర్శించారు. అధికారులు పూర్తిగా ముఖ్యమంత్రి, మంత్రుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై దాడికి పెద్ద సంఖ్యలో వ్యక్తులను ఉసిగొల్పి ఎస్కార్ట్ ఇచ్చి పంపారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటి వద్దకు వెళ్లిన తమ ఎమ్మెల్యేలను అరెస్టు చేశారన్నారు. మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు పురుష పోలీసులను, పురుష ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు మహిళా పోలీసులను ఉపయోగించడం శిఖండి రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని భయపడి సస్పెండ్ చేశారు : పల్లా**

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు రోజులుగా హైడ్రామా జరుగుతోందన్నారు. అన్ని అంశాలపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సభను కొద్ది రోజులకే పరిమితం చేసి ప్రతిపక్ష సభ్యులను సభకు రాకుండా చేశారని విమర్శించారు. భూ కుంభకోణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ వైఫల్యాలు సహా అన్ని అంశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీస్తారని, సమాధానం చెప్పలేకనే కుట్రపూరితంగా తమను సస్పెండ్ చేసినట్లు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై దాడికి ఎమ్మెల్యేలు, విప్‌లను పంపి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయంగా రాక్షసానందం పొందారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు పతనం దగ్గరపడిందని వ్యాఖ్యానించారు.

**రేవంత్ దాష్టీకాలను రాహుల్ కట్టడి చేస్తారా? : ఎంపీ వద్దిరాజు**

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై సోనియా, రాహుల్ గాంధీలకు లేఖలు రాశామని తెలిపారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న దాష్టీకాలను రాహుల్ గాంధీ కట్టడి చేస్తారా లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం, శాసనసభ్యుల హక్కులను కాపాడాలని కోరారు. కమిషన్ల సభ్యులను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి దివికొండ దామోదర్ రావు, ఎమ్మెల్సీ వాణిదేవి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ లీగల్ సెల్ బృందం నుంచి బీఎస్ ప్రసాద్, సోమా భరత్, లలితా రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

# హార్ముజ్‌పై ఇరాన్‌తో చర్చలకు గల్ఫ్ దేశాలు?

- **బ్రిక్స్ భేటీ తర్వాత సమావేశంపై నిర్ణయం**
- **సలాలాలో సోమవారం భేటీకి యోచన**
- **హౌతీల దూకుడుతో బాబ్ అల్ మందబ్‌పై ఆందోళన**

**దుబాయ్, సెప్టెంబరు 12:**

హార్ముజ్ జలసంధి భవిష్యత్తుపై ఇరాన్‌తో చర్చలు జరిపే అంశాన్ని గల్ఫ్ దేశాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అమెరికా-ఇరాన్ ఘర్షణలు, యెమెన్‌లో హౌతీల దూకుడుతో సముద్ర మార్గాల్లో అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్చలకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ప్రత్యేక సమావేశంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

**సలాలాలో భేటీకి యోచన**

ఆరు దేశాల గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (GCC) ప్రతినిధులు, ఇరాన్ అధికారులతో సోమవారం దక్షిణ ఒమన్‌లోని సలాలాలో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒమన్ ఈ భేటీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అయితే సమావేశం ఖరారుపై స్పష్టత లేదు. ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి కూడా సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. హార్ముజ్‌పై ఇరాన్-ఒమన్ చర్చల ఫలితాలపై భేటీలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

**హౌతీల దూకుడుతో ఆందోళన**

యెమెన్‌లోని హౌతీలు బాబ్ అల్ మందబ్ జలసంధికి సమీపంలోని ఎర్ర సముద్ర తీర ప్రాంతాల వైపు ముందుకు సాగుతున్నట్లు సమాచారం. దీంతో ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన ఈ మార్గంలో అంతరాయాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. హార్ముజ్‌తో పాటు బాబ్ అల్ మందబ్‌లోనూ నౌకాయానానికి ఆటంకాలు ఏర్పడితే చమురు మార్కెట్లపై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది. హార్ముజ్‌పై నియంత్రణ విషయంలో ఇరాన్ వెనక్కి తగ్గడం లేదు. ఒమన్‌తో సముద్ర రవాణాకు సంబంధించిన విధివిధానాలపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. హార్ముజ్ గుండా వెళ్లే నౌకల నుంచి రుసుము వసూలు చేసే ప్రతిపాదన ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనిని అమెరికా, గల్ఫ్ దేశాలు వ్యతిరేకిస్తున్నాయి.

**చమురు ధరలపై ప్రభావం**

హార్ముజ్ సంక్షోభంతో సౌదీ అరేబియా, యూఏఈ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కొంత చమురును ఎగుమతి చేస్తున్నాయి. అయినప్పటికీ రవాణా అంతరాయాలు ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ వారం చమురు ధరలు భారీగా పెరగగా.. శుక్రవారం బ్రెంట్ క్రూడ్ 3 శాతానికి పైగా తగ్గి బ్యారెల్‌కు సుమారు 104 డాలర్ల వద్ద ట్రేడైంది. అమెరికా-ఇరాన్ యుద్ధం మరికొన్ని నెలలు కొనసాగే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదించింది.

# కీలక ఖనిజాల్లో స్వయం సమృద్ధే లక్ష్యం

- **రూ.36 వేల కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్**
- **ఈ-వ్యర్థాల నుంచి 30 శాతం అవసరాలు తీర్చే అవకాశం**
- **58 రీసైక్లింగ్ కంపెనీలతో ప్రత్యేక కార్యక్రమాలు**
- **లిథియం కోసం అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీతో చర్చలు**
- **బ్రిక్స్ సదస్సులో కీలక ఖనిజాలపై చర్చ**



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:**

క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాలు) రంగం భారత్‌తో పాటు ప్రపంచానికి అత్యంత కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మొబైల్ ఫోన్లు, అంతరిక్ష సాంకేతికత, ఎలక్ట్రానిక్స్ సహా ఆధునిక రంగాలన్నింటికీ ఇవి అవసరమని తెలిపారు. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు దేశీయ అన్వేషణను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రూ.36 వేల కోట్ల ప్రోత్సాహక పథకంతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు.

**ఈ-వ్యర్థాల రీసైక్లింగ్‌పై దృష్టి**

అర్బన్ మైనింగ్ ద్వారా దేశ అవసరాల్లో 25 నుంచి 30 శాతం కీలక ఖనిజాలను సమకూర్చుకునే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం 58 రీసైక్లింగ్ కంపెనీలతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా కేరళ వరకు క్రిటికల్ మినరల్ కారిడార్‌తో పాటు నాలుగు ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాబోయే బ్రిక్స్ సదస్సులోనూ ఈ అంశంపై చర్చిస్తామని తెలిపారు.

**లిథియం కోసం విదేశాల్లో అన్వేషణ**

దేశంలో లిథియం నిల్వలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో విదేశాల్లో వనరుల సమీకరణకు వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. అర్జెంటీనాలో ఇప్పటికే ఐదు లిథియం బ్లాకులను దక్కించుకుని అన్వేషణ ప్రారంభించామని, మరో ఐదు బ్లాకుల కోసం చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఆస్ట్రేలియా, చిలీతోనూ సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు.

# సింధ్‌లో హిందూ బాలికలకు రక్షణ కరువు

- **కిడ్నాప్, మతమార్పిడి, బలవంతపు పెళ్లిళ్లపై ఆరోపణలు**
- **తల్లిదండ్రుల వద్దకు పంపాలని కన్నీటితో వేడుకోలు**
- **షెల్టర్ హోమ్‌కు తరలించిన కోర్టు**
- **10 రోజుల్లో ఆరుగురు బాలికల అపహరణ?**
- **మైనారిటీ హక్కుల కార్యకర్తల ఆందోళన**

**కరాచీ, సెప్టెంబరు 12:**

పాకిస్థాన్‌లో మైనారిటీ హిందూ, క్రిస్టియన్ ప్రజలకు రక్షణ కరువవుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సింధ్ ప్రావిన్స్‌లో హిందూ బాలికల అపహరణ, మతమార్పిడి, బలవంతపు వివాహాల ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పోలీసు, న్యాయ వ్యవస్థల నుంచి బాధిత కుటుంబాలకు తగిన



సహకారం అందడం లేదని హక్కుల కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. తాజాగా 13, 14 ఏళ్ల ఇద్దరు హిందూ బాలికలు తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్లాలని కన్నీటితో వేడుకున్నా.. కోర్టు వారిని షెల్టర్ హోమ్‌కు పంపించింది. తమ కుమార్తెలను అపహరించి ఇస్లాంలోకి మార్చి, ఇద్దరు యువకులు బలవంతంగా వివాహం చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**కోర్టు వెలుపల కన్నీటి పర్యంతం**

సింధ్‌లోని టాండో అల్లహ్యార్ జిల్లాకు చెందిన ఇద్దరు బాలికలను అష్ఫద్ సోలంగి, మన్సూర్ సోలంగి అనే వ్యక్తులు వివాహం చేసుకున్నట్లు హక్కుల కార్యకర్తలు, బాధిత కుటుంబీకులు ఆరోపించారు. కిడ్నాప్ కేసులో బాలికలను కోర్టులో హాజరుపరచగా.. విచారణ అనంతరం తల్లిదండ్రులతో పంపించకుండా రెండు రోజుల పాటు సేఫ్ హౌస్‌లో ఉంచాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు వెలుపల బాలికలు కన్నీరు పెట్టుకుంటూ తమను ఇంటికి పంపించాలని పదేపదే వేడుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**10 రోజుల్లో ఆరుగురు బాలికల అపహరణ?**

ఈ ఘటనపై చర్చ జరుగుతున్న సమయంలోనే టాండో అల్లహ్యార్ జిల్లాలో 14 ఏళ్ల పాన్సీ కోహ్లీ సెప్టెంబరు 9న కిడ్నాప్‌కు గురైనట్లు ఓ హక్కుల కార్యకర్త తెలిపారు. పది రోజుల వ్యవధిలో జిల్లాలో ఆరుగురు హిందూ మైనర్ బాలికలు అపహరణకు, మతమార్పిడికి గురైనట్లు పేర్కొన్నారు. కోహ్లీ, భీల్, మేఘ్వార్ వంటి అణగారిన వర్గాలకు చెందిన పేద కుటుంబాలు పోలీసు వ్యవస్థ, న్యాయ సహాయం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో పరిమిత అవకాశాలతో మరింత సున్నిత పరిస్థితుల్లో ఉన్నాయని మైనారిటీ హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. పాకిస్థాన్‌లో వందలాది మంది హిందూ బాలికలు కిడ్నాప్, బలవంతపు వివాహాలను ఎదుర్కొంటున్నారని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా పేర్కొంది.

**చట్టం ఏం చెబుతోంది?**

బాలికల వయసు 13, 14 ఏళ్లుగా నిర్ధారణ అయితే.. సింధ్ చైల్డ్ మ్యారేజెస్ రెస్ట్రెయింట్ యాక్ట్, 2013 ప్రకారం వారు పిల్లలుగా పరిగణించబడతారు. ఈ చట్టం ప్రకారం పురుషులు, మహిళలు ఇద్దరికీ వివాహ కనీస వయసు 18 సంవత్సరాలు. ప్రస్తుతం బాలికల వయసును నిర్ధారించాల్సి ఉంది

## జిల్లా స్థాయి పోటీలకు పొన్నం అభిరామ్ ఎంపిక

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



మొలంగూర్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి పొన్నం అభిరామ్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల విద్యార్థుల బృం దంతో కలిసి వాలీబాల్‌లో ప్రతిభ చాటిన అభిరామ్‌ను పాఠ శాల ప్రధానోపాధ్యాయులు కంకణాల నీరజ అభినందిం చారు. మొలంగూర్ గ్రామానికి వాలీబాల్‌లో ఉన్న పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడంతో పాటు విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా పాఠశాల తరపున కృషి చేస్తున్నామని నీరజ తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామ సర్పంచ్ పూదరి రాజు, ఉపసర్పంచ్ దండు రాజేష్, గ్రామపంచాయతీ సభ్యులు, ప్రజాప్రతి నిధులు, క్రీడాభిమానులు, దాతలు, పాత్రికేయ మిత్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## గుర్నాథ్ పల్లి సబ్ సెంటర్లో పోషకాహార వారోత్సవాలు

**శెనార్తి మీడియా, వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గుర్నాథ్ పల్లి అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి టీచర్ తోట అలివేలు మంగమ్మ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ ఆవుల నరసింహ హాజరైనారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు పోషణ కలిగినటువంటి ఆహార పదార్థాలు ఆకు కూరలు పాలు గుడ్లు బెల్లం పల్లీలు నువ్వులు మునగ ఆకు మొదలగు ఆహార పదార్థాలు రోజువారి తినే ఆహారంలో తీసుకోవాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంతుల ప్రశాంత్, వార్డ్ మెంబర్స్ జక్క రఘు, నకరికంటి గీత, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, ఆశ కార్యకర్త కేతం సౌజన్య, గర్భవతులు బాలింతలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## 'కుప్టా'కు నూతన కమిటీ ఏర్పాటు చేయాలి

- **పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలకు పరిష్కారం చూపాలి**
- **ఎన్నికలే పరిష్కార మార్గం.. కుప్టా కమిటీ కోసం రిజిస్ట్రార్‌కు అధ్యాపకుల వినతి**



**శెనార్తి మీడియా,హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ (కుప్టా)కు ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని వివిధ విభాగాల పార్ట్‌టైం అధ్యాపకులు కోరారు. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. గత కమిటీ రద్దయి కొన్ని సంవత్సరాలు గడిచినప్పటికీ నూతన కమిటీ ఏర్పాటు కాకపోవడంతో పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను యూనివర్సిటీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు సమన్వయ వేదిక లేకుండా పోయిందని అధ్యాపకులు తెలిపారు. విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 150 మందికి పైగా పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఎన్నికల ద్వారా ప్రతినిధి కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకుల వినతిని స్వీకరించిన రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం గతంలో జరిగిన కుప్టా ఎన్నికల ప్రక్రియను పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్‌టైం అధ్యాపకులు పాల్గొన్నారు.



## మట్టి వినాయకులనే పూజించాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని మొలంగూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంకణాల నీరజ సూచించారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రతిమలను తయారు చేసిన విద్యార్థులను నీరజ అభినందించారు. వారికి సూచనలు అందిస్తూ సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడం వల్ల నీటిలోని జీవులు మృతి చెందడంతో పాటు నీరు కలుషితమవుతుందని నీరజ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఇళ్లలో మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు.



**విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ**

అనంతరం పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. మండల ఎంపీ ఓ ప్రభాకర్, గ్రామ సర్పంచ్ పూదరి రాజు, ఉపసర్పంచ్ దండు రాజేష్, అమ్మ ఆదర్శ కమిటీ జరీనా బేగం, గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించారు.

## ప్రాణాలతో ఉన్న వ్యక్తికి చావు డప్పు కొట్టే సంస్కృతి మాదిగ జాతిది కాదు



- **జాంబవంతుని వారసులుగా మాదిగలకు ఆత్మాభిమానం ఉంది..**
- **రాజకీయ మనుగడ కోసం జాతిని తాకట్టు పెడుతున్నారు**
- **జాతి నీతిని మరిచి చావు డప్ప కొడితే శుద్ధి చేయడంలో తప్పేముంది?**
- **చావు డప్ప కొట్టిన వారిని మాదిగలుగా భావించడం లేదు**
- **బీఆర్ఎస్ దళిత నాయకులు**

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

ప్రాణాలతో ఉన్న వ్యక్తికి చావు డప్పు కొట్టే సంస్కృతి మాదిగ జాతికి లేదని బీఆర్ఎస్ దళిత నాయకులు స్పష్టం చేశారు. బెజ్జంకి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో దళిత నాయకుడు కనగండ్ల తిరుపతి మాట్లాడుతూ జాంబవంతుని వారసులుగా మాదిగలకు ఆత్మగౌరవం ఉందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మాదిగ సమాజాన్ని ఉపయోగించుకోవడాన్ని సహించబోమని హెచ్చరించారు. మండల ఫోరం అధ్యక్షుడు దిటి బాలనర్సు, దళిత నాయకుడు దేవయ్య మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. దళిత బంధు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. దళిత బంధు కింద రూ.12 లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల హామీల అమలు వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. దళితుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కనగండ్ల తిరుపతి, ఎల శేఖర్ బాబు, మాశం బాబు, రామంచ పరశురాం తదితర మండల దళిత నాయకులు పాల్గొన్నారు.

## మూడు గ్రామాలకు బోరు బావులు మంజూరు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



మండలంలోని వంకాయగూడెం, అంబాల్‌పూర్, ఎరడపల్లి గ్రామాలకు ఎంపీ నిధులతో బోరుబావులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ బోరుబావుల నిర్మాణ పనులను ప్రారంభించారు. బోరుబావులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు వెన్నెం మల్లేష్, కొయ్యడ రజిత, వడ్లకొండ వినోద్, ఉప సర్పంచులు రేణుక, మహేష్, రాజశేఖర్, బీజేపీ నాయకులు అలివేలు సమ్మిరెడ్డి, దండు కొమురయ్య, రాసమల్ల శ్రీనివాస్, నరేష్, రాజిరెడ్డి, గుర్రం శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజించాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేశారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను తయారు చేసి పూజించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవన్ రెడ్డి సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, వాటికి వేసే రంగుల వల్ల నీరు, పర్యావరణం కలుషితమై జలచరాలు, పశువులకు హాని కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఇంటిలో మట్టి గణపతులను వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## గుగ్గిళ్ల–వింజపల్లి కాజ్‌వే నిర్మాణానికి రూ.1.75 కోట్లు



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని గుగ్గిళ్ల–వింజపల్లి గ్రామాల మధ్య కాజ్వే నిర్మాణానికి రూ.1.75 కోట్ల నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు, రైతులు, గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చెప్యాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చెప్యాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇరు గ్రామాల ప్రజల సుదీర్ఘ కాల కల నెరవేరిందన్నారు. ప్రజల శ్రేయస్సు, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యేలకు గ్రామస్తుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కాజ్వే నిర్మాణంతో ఇరు గ్రామాల ప్రజలు, రైతులకు రాకపోకలు సులభతరం కానున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ బెజ్జంకి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, రజాకార్ల దురాగతాలను ఎదుర్కొని సాధించిన స్వేచ్ఛా చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల చరిత్రలో కీలకమైన రోజని పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయాలకు అతీతంగా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించి, అమరవీరులకు ఘన నివాళులు అర్పించాలని డిమాండ్ చేశారు. విమోచన పోరాటంలో పాల్గొన్న వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి పోరాట స్ఫూర్తిని యువతకు తెలియజేసేలా రాష్ట్రవ్యాప్తంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, గుగ్గిళ్ల సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, మండల నాయకులు సంఘ రవి, గైని రాజు, దొమ్మాటి రాములు, వడ్లూరు సాయిలు, గంప రవికుమార్, జెల్లా అనిల్, బెజ్జంకి రాజమల్లు, బుర్ర కిషన్, గాండ్ల శీను, వడ్లూరు శ్రీనివాస్, లోనే నర్సింగం, ధోనే అంజన్న, బోనగం నరేష్, చంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శనివారం 1 కేశవపట్నం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అండర్–14, అండర్–17 బాలుర విభాగాల్లో ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ, కేశవపట్నం గ్రామ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేశవపట్నం మండలం అన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల క్రీడల కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, రామానంద తీర్థ, రవికుమార్, లక్ష్మీపతి, జస్బీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**శెనార్తి మీడియా, నిర్మల్:**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించలేని దరఖాస్తులను వెంటనే ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ మాసం గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. అక్టోబర్ 8 వరకు పోషకాహారం, ఆరోగ్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అనేక సంస్కరణలకు ఆద్యుడు సుబ్రహ్మణ్య భారతి

## ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శకుడు సుబ్రహ్మణ్య భారతి

### నేడు సుబ్రహ్మణ్య భారతి వర్ధంతి

కవిత్వంలో ప్రగతి శీలమైన, సంస్కరణాత్మకమైన ఆదర్శాన్ని వ్యక్తీకరించిన కవి సుబ్రహ్మణ్య భారతి. ఆధునిక తమిళ సాహిత్యానికి ఆయనను మార్గదర్శకునిగా భావిస్తారు. ప్రాచీన, సమకాలీన అంశాల మేలు కలయికగా నిలిచే కవిత్వ శైలి ఆయన సొంతం. ఆధునిక తమిళ సాహిత్యంలో ఆయన ఆలోచన, ఊహ, పద్యంలోని పటుత్వం కొత్తపుంతలు తొక్కాయి. వేలాది కవితలు... భారత జాతీయ గీతాలు, ప్రణయ గీతాలు, బాలల కవితలు, ప్రకృతి గీతాలు, తమిళ భాష గొప్పతనాన్ని ఉగ్గడించే కవితలు, భారత స్వాతంత్ర్య పోరాట ప్రముఖులైన తిలక్, గాంధీ, లజపతిరాయ్ వంటివారిని ప్రస్తుతించే కవితలు వంటి విస్తారమైన, విభిన్నమైన అంశాలను స్వీకరించి అద్భుతమైన రీతిలో రాశారు. శక్తి, కాళి, వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, శివుడు, కృష్ణుడు వంటి వారినే కాక ఇతర మతదేవతలైన అల్లా, ఏసు వంటివారిని కూడా ప్రస్తుతించారు. జాతీయ, సంస్కరణ నాయకులైన అరబిందో, బాలగంగాధర తిలక్, స్వామి వివేకానంద వంటివారి ప్రసంగాలను అనువదించారు. చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి' (1882 డిసెంబరు 11 -- 1921 సెప్టెంబరు 12) తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శిగానూ, "మహాకవి భారతి"గానూ సుప్రసిద్ధుడు, తమిళ సాహిత్య ప్రముఖుల్లో అత్యున్నత వ్యక్తిగా పేరొందారు. ఆయన అసంఖ్యాక రచనలు భారత స్వాతంత్ర ఉద్యమ కాలంలో దేశభక్తి, జాతీయత వంటి భావాలను వెలుగొందేలా చేశాయి. భారతి చిన్నసామి సుబ్రహ్మణ్య అయ్యర్, లక్ష్మీ అమ్మాళ్ దంపతులకు సుబ్బయ్యగా 11 డిసెంబర్ 1882 లో డిసెంబర్ 11న ఎట్టయపురం గ్రామంలో జన్మించారు. తిరునల్వేలిలోని ఎం.డి.టి. హిందూ కళాశాల అన్న స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. యుక్త వయసు నుంచి సంగీతం అభ్యసించడం, 11వ యేటనే కవితలల్లడం నేర్చారు. విద్యలకు అధిదేవత అయిన సరస్వతీ దేవి పేరిట "భారతి" అన్న బిరుదాన్ని ఆ సమయంలోనే ఆయన పొందారు. విశేషమైన పట్టుదల, కృషితో ఆయన 32 భాషలు (29 భారతీయ భాషలు, 3 విదేశీ భాషలు) నేర్చుకున్నారు. స్త్రీలు రాజకీయాల్లో భాగస్వాములు కావాలని ప్రబోధిస్తూ, ఉద్యమించిన వారిలో తొట్టతొలి సంస్కర్తగా భారతిని భావిస్తారు. భారతి స్త్రీల హక్కుల గురించి, వారి విద్య గురించి విస్తృత స్థాయిలో ఆలోచించారు. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులేనని భావిస్తే ప్రపంచం వైజ్ఞానికంగా, మేధాపరంగా సమున్నతంగా విలసిల్లుతుందని భారతి భావించారు. స్త్రీల హక్కులకు భంగం కలిగించేలా మాట్లాడిన శాస్త్రాలను, ఆచారాలను ఆయన ఖండించారు. ఆయన భావాల్లో చాలావరకూ ఆధునిక కాలానికి కూడా సమకాలీనంగా నిలవడం విశేషం హిందూ సమాజంలోని కుల వ్యవస్థకు కూడా భారతి వ్యతిరేకంగా పోరాడారు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా తన కుల గుర్తింపును విడిచి పెట్టేశారు. జీవించే ప్రతి జీవం సమానమేనని భావించారు. దీన్ని చూపించేందుకు ఒక యువ దళితునికి ఉపనయనం చేసి బ్రాహ్మణుని చేశారు. అప్పట్లో తర్వాతి తరాల వారి మనస్సులోకి పెద్దలు విభజన బీజాలు నాటడాన్ని వెక్కిరించారు. వేదాలను, గీతను బోధించేప్పుడు తమ స్వంత ఆలోచనలు దానిలో చేర్చి కువ్యాఖ్యానాలు చేయడాన్ని బహిరంగంగా ఖండించారు. దళితులను హిందూ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి ఆయన గట్టిగా మద్దతిచ్చారు. తమిళనాట సుబ్రహ్మణ్య భారతి భావాత్మక విప్లవాన్ని సాధించారు. సంస్కరణ, దేశభక్తి, జాతీయ వాదం, తమిళ భాష ఔన్నత్యం వంటి అంశాల్లో ఆయన కవితలు తమిళులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. సామాన్యమైన ప్రజలు ఆయన కవితలను కంఠస్థం చేసి సందర్భానుసారం ప్రస్తావించే స్థాయికి వచ్చాయి. కోట్లాదిమంది ప్రజలు ఆయన రాసిన కవితల పంక్తులను ప్రస్తావించడం విశేషం. ప్రేమ, భక్తి, కరుణ, శాంతి, యుద్ధం వంటి సార్వజనీనమైన అంశాల్లోనూ భారతి గీతాలు సందర్భానుసారంగా ప్రజల నాలుకలపై నర్తించాయి. భారత ప్రభుత్వం, మానవ వనరుల అభివృద్ధి శాఖతో కలిసి 1987లో అత్యున్నత జాతీయ స్థాయి సుబ్రహ్మణ్య భారతి పురస్కారాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం హిందూ సాహిత్యంపై అత్యున్నత స్థాయి రచనలు చేసిన రచయితలను సత్కరిస్తోంది. భారతీయార్ విశ్వవిద్యాలయాన్ని ఆయన పేరిట 1982లో కోయంబత్తూరులో నెలకొల్పారు. మెరీనా బీచ్ వద్ద, భారత పార్లమెంటు భవనం వద్ద భారతీయార్ విగ్రహాన్ని నెల కొల్పారు. కోయంబత్తూరు లోని భారతీయార్ రోడ్డు, న్యూఢిల్లీ లోని సుబ్రమణియం భారతి మార్గ్,ఇలా ఎన్నో రోడ్లుకు ఆయన పేరు పెట్టారు. కర్ణాటక సంగీత రంగంలో తరచుగా వినవచ్చే కృతుల్లో సుబ్రహ్మణ్య భారతి కీర్తనలు ఉన్నాయి. ఆయన రచించిన పలు కీర్తనలను పలువురు కర్ణాటక సంగీత విద్వాంసులు కచేరీల్లోనూ, రికార్డుల్లోనూ గానం చేశారు. **1921 సెప్టెంబరు 12లో అర్ధరాత్రి ఆయన మరణించారు.**



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రోత్సాహమే మనోధైర్యానికి మూలాధారం

### నేడు జాతీయ ప్రోత్సాహక దినోత్సవం




సెప్టెంబర్ 12న జాతీయ ప్రోత్సాహక దినోత్సవం జరుపుకోవడం వెనుక ఒక లోతైన మానవీయ భావజాలం దాగి ఉంది. మనిషి జీవనంలో విజయాలు, పరాజయాలు, ఆనందం, దుఃఖం, ఆశలు, నిరాశలు పరంపరగా ఎదు-రవుతుంటాయి. కానీ ఈ విభిన్న అనుభవాల మధ్య నిలబెట్టేది మనోధైర్యం. ఆ మనోధైర్యాన్ని నిలబెట్టే శక్తి ప్రోత్సాహమే. ఒక మనిషి మాట మరొక మనిషికి ప్రాణాధార మవుతుందని చెప్పడానికి ఇది అత్యుత్తమ ఉదాహరణ. జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మొదట అమెరికాలో 2007లో ఆవిర్భవించింది. "ప్రతి మనిషి సామర్థ్యం అపారమైందే కాని దాన్ని వెలికితీయడానికి ప్రేరణ కావాలి" అన్న ఆలోచనతో ఈ రోజు ఏర్పాటైంది. ఆలోచన ఒక దేశానికి పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12న ఈ దినాన్ని గుర్తుచేసుకుంటూ సానుకూల ఆలోచనలు పంచుకుంటున్నారు. ప్రోత్సాహం ఎందుకు అవసరమంటే, అది కేవలం ఒక శబ్దం కాదు, ఒక శక్తి. ఒక చిన్నపిల్ల తొలిసారి నడక మొదలు పెట్టినప్పుడు తల్లి చెప్పే "నీకు వస్తుంది" అన్న మాటే బలాన్నిస్తుంది. విద్యార్థి పరీక్షల భారం ఎదుర్కొన్నప్పుడు గురువు చెప్పే "నువ్వు చేయగలవు" అన్న మాటే ధైర్యాన్నిస్తుంది. క్రీడాకారుడు ఓటమి తర్వాత నిరుత్సాహానికి లోనైనప్పుడు స్నేహితుడు చెప్పే "తర్వాతి సారి నీ విజయం ఖాయం" అన్న మాటే అతనిని తిరిగి లేస్తుంది. ఈ మాటల్లో దాగి ఉన్న ప్రేరణ తోనే మనిషి అసాధ్యాన్ని సాధ్యం చేస్తాడు.



సమాజంలో ప్రోత్సాహం ఒక బంధాన్ని పెంచుతుంది. మనం ఇతరులను అభినందించినప్పుడు, ప్రోత్సహించినప్పుడు వారితో ఉన్న బంధం మరింత దృఢమవుతుంది. ఉద్యోగ స్థలంలో సహోద్యోగికి ఒక ప్రశంస, కుటుంబంలో బిడ్డకు ఒక అభినందన, స్నేహితునికి ఒక ధైర్య వాక్యం – ఇవన్నీ కలిసి ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. పరిశోధనల ప్రకారం ఉద్యోగ ప్రదేశాల్లో ప్రోత్సాహక వాతావరణం ఉంటే ఉత్పాదకత 30 శాతం పెరుగుతుందని, విద్యార్థులు 40 శాతం ఎక్కువగా ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్తారని నిర్ధారించబడింది. ఇది గణాంకాల రూపంలో ప్రోత్సాహం యొక్క శక్తిని స్పష్టంగా చూపిస్తుంది. ఈ రోజు పాటించాల్సిన విధానం చాలా సులభం. కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలి, సహోద్యోగులకు ధైర్యం చెప్పాలి, వెనుకబడిన వారికి సానుకూల మద్దతు అందించాలి. ఒక చిన్న సహాయం కూడా ఒక పెద్ద ప్రోత్సాహ మవుతుంది. ఉదాహరణకు, చదువులో ఇబ్బంది పడుతున్న విద్యార్థికి సహాయం చేయడం, బిజీగా ఉన్న స్నేహితుని పనిలో తోడ్పడడం, ఒక వృద్ధునికి ధైర్యం చెప్పడం వంటి చిన్న చర్యలు గొప్ప ఫలితాలు ఇస్తాయి. మన భారతీయ సంస్కృతిలో ప్రోత్సాహం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. వేదాల్లో "మంచి మాట వంద యజ్ఞాల కంటే శ్రేష్ఠం" అని చెప్పబడింది. కవి గురజాడ అప్పారావు "దేశమంటే మట్టి కాదు, మనుషుల సమూహం" అన్నప్పుడు కూడా పరస్పర ప్రోత్సాహమే ఒక సమాజాన్ని నిర్మిస్తుందని సూచించారు. తాళ్ళపాక అన్నమయ్య, త్యాగరాజు కీర్తనల్లోనూ భక్తిని ప్రేరేపించే ఉత్సాహ వాక్యాలే ప్రధానంగా కనిపిస్తాయి. ప్రోత్సాహం ఇవ్వడం మన కర్తవ్యం మాత్రమే కాదు, మన సంస్కృతి కూడా. ఈ రోజు మనకు గుర్తుచేస్తున్నది – ప్రోత్సాహం ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక సమాజాన్నీ మార్చగలదు. ఒక చిన్న వాక్యం, ఒక ఆశాజనకమైన దృష్టి, ఒక మధురమైన అభినందన – ఇవన్నీ కలిసి నిస్సహాయుడిని స్ఫూర్తివంతుడిగా మార్చగలవు. జాతీయ ప్రోత్సాహక దినోత్సవాన్ని కేవలం ఒక రోజుకు పరిమితం చేయకుండా ప్రతీ రోజూ మనం ఆచరించాలి. మన కుటుంబం, మన స్నేహితులు, మన సహచరులు మాత్రమే కాదు, మన పరిచయం లేని వ్యక్తికైనా ఒక చిరునవ్వు, ఒక సానుకూల మాట ఇవ్వగలిగితే అదే నిజమైన ప్రోత్సాహం అవుతుంది. ప్రోత్సాహం ఇస్తే ప్రేరణ కలుగుతుంది, ప్రేరణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, ఆత్మవిశ్వాసం విజయానికి దారితీస్తుంది. ఈ శాశ్వత సత్యాన్నే సెప్టెంబర్ 12 జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తొలిమహిళా న్యూస్ రీడర్ ఆంధ్రా నైటింగేల్ మంగమ్మ



**జోలెపాళ్యం మంగమ్మ. అలనాటి రేడియో శ్రోతలకు సుపరిచితమైన పేరు. నేడు ఆకాశవాణి ప్రపంచము లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. భారత ప్రభుత్వ సమాచార , ప్రసార మంత్రిత్వశాఖ అధ్వర్యములో పని చేస్తుంది. రేడియో వార్తలు నిబద్ధతకు, విశ్వసనీయతకు తొలినాళ్ళ నుండి పేరు పొందాయి. సమాచార వ్యవస్థ పటిష్ఠంగా లేని రోజుల్లో రేడియో వార్తల కోసం జనం ఆసక్తిగా ఎదిరి చూసే వారు.**

### నేడు జోలెపాళ్యం మంగమ్మ జయంతి

ఒకప్పుడు రేడియో మాత్రమే ఒక సమాచార సాధనంగా ఉన్న పాతకాలపు మరచి పోలేని రోజులలో, ప్రజలకు వార్తలు ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ప్రజలలో ఒకరిగా, అందరికీ ఆత్మీయులుగా వార్తా చదువరులు తమ తమ శైలులలో సుస్థిర స్థానం సంపాయించు కొన్నారు. ఆకాశవాణిలో వార్తా చదువరులుగా (చీజుఔా =జూాణజు=ూా), ఎంతగానో ప్రాచుర్యం పొందిన వారిలో న్యూస్ రీడర్సుది ప్రథమ స్థానం. ఆ విధంగా తెలుగులో ఇటు ప్రాంతీయ కేంద్రాలైన విజయవాడ, హైద్రాబాదు నుండి వచ్చే ప్రాంతీయ వార్తలు, అటు హస్తిన నుండి వచ్చే జాతీయ వార్తలు ప్రజలకు కావలిసిన విశేషాలను నిర్ణీత సమయ సారిణి ప్రకారం తెలియ చెప్పేవి.

ఆ రోజుల్లో ఢిల్లీ నుంచి తెలుగు వార్తలు చదివే ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బాణీ. ఎవరి స్టైల్ వారిదే. ప్రముఖ సినీ నటుడు కొంగర జగ్గయ్య,కపిల, కాశీపతి, శ్రీ వాత్సవ, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, పన్యాల రంగనాధరావు, వనమాలి ప్రసాద్, జోళిపాళ మంగమ్మ, కందుకూరి సూర్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీరాములు, అద్దంకి మన్నార్, వావిలాల రాజ్యలక్ష్మి, దుగ్గిరాల పూర్ణయ్య, ఏడిద గోపాలరావు వార్తలు చదవడంతో తెలుగువారి హృదయాలకు సన్నిహితులయ్యారు. ఇలా ఎందరో మహానుభావులు. ఎవరికి ఎవరు తీసిపోరు. వార్తలు మధ్య నుంచి విన్నా చదువు తున్నది పలానా అని చెప్ప గలిగేలా తమదయిన తరహాలో వార్తలు చదివే వాళ్ళు.



ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో తెలుగు న్యూస్ రీడర్గా, ఢిల్లీ తెలుగు న్యూస్ విభాగంలో దశాబ్ద కాలానికి పైగా సేవలందించిన మంగమ్మ తెలుగు రేడియో శ్రోతలకు చిర పరిచయస్థురాలు. "ఆకాశవాణి.. వార్తలు చదువుతున్నది జోలిపాళ్యం మంగమ్మ" అంటూ తెలుగు శ్రోతలకు వార్తలు వినిపించిన చిరపరిచిత స్వరం ఆమెది. జోలిపాళ్యం మంగమ్మతో పాటు , విభాగ అధిపతి దుగ్గిరాల పూర్ణయ్య, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి, కందుకూరి సూర్యనారాయణ, ఏడిద గోపాలరావు, అద్దంకి మన్నార్ తదితరులు ఆమె సహచరులు.

జోలెపాళ్యం మంగమ్మ తెలుగు రచయిత్రి, రేడియో వార్తా చదువరి. మంగమ్మ ఆల్ ఇండియా రేడియోలో మొట్టమొదటి మహిళా న్యూస్ రీడర్గా ప్రసిద్ధురాలుగా పేరెన్నిక గన్నారు .

ఆమె చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1925, సెప్టెంబరు 12న జన్మించారు. ఎం.ఎ., బి.ఎడ్ చదివారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈమెకు తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచ్, ఎస్పరాంటో, తమిళ, హిందీ భాషలలో ప్రావీణ్యం ఉంది. ఈమె ఆలిండియా రేడియో న్యూఢిల్లీలో 10 సంవత్సరాలు ఎడిటర్గా, న్యూస్ రీడర్గా విధులు నిర్వర్తించారు. 1962 నుండి నేషనల్ ఆర్కీవ్స్, ఢిల్లీలో పరిశోధనలు చేశారు. బోధనా రంగంలో సుమారు పాతిక సంవత్సరాల అనుభవం సంపాదించారు. ఈమె కేంద్ర సమాచార శాఖ, విదేశాంగ శాఖలలో కీలకమైన పదవులను నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొదలైన సంస్థలలో జీవిత సభ్యురాలు. ఇంకా ఈమె అనిబీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షురాలిగా, గాంధీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవల్పమెంట్ అధ్యక్షురాలిగా, లోక్ అదాలత్లో సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలను అందించారు. ఆమె ఇంగ్లీషు,



తెలుగు భాషలలో పలు పుస్తకాలను రచించారు. న్యూఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం (విజయవాడ) విశిష్ట అవార్డు మొదలైన సత్కారాలను పొందింది. సరోజినీ నాయుడు అనుయాయిగా ఈమె పేరు గడించారు. "ఆంధ్రానైటింగేల్" అనే బిరుదును పొందారు.

తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు (1746-1856), ఆంధ్రదేశంలో క్రైస్తవ మిషనరీల సేవ, ఇండియన్ పార్లమెంట్, శ్రీ అరబిందో, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, అనిబీసెంట్ పుస్తకాలను ఆమె తెలుగులో వెలువరించారు. అలాగే ప్రింటింగ్ ఇండియా, అల్లూరి సీతా రామరాజు, లాస్ట్ పాలెగార్ ఎన్కౌంటర్ విత్ ది బ్రిటిష్ ఇన్ ది సీడెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1846-1847, ది రేట్ స్కూల్స్ ఆఫ్ గోదావరి పుస్తకాలను ఆంగ్లంలో రచించారు. మదనపల్లెలోని తన స్వగృహంలో 2017, ఫిబ్రవరి 1వ తేదీన తన 92వ యేట వృద్ధాప్య సమస్యలతో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# యూఎస్ ఓపెన్ ఫైనల్లో రిబకినా వర్సెస్ సబలెంకా

**న్యూయార్క్, సెప్టెంబర్ 11** : యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో శనివారం జరగనున్న ఫైనల్ పోరు అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ అరినా సబలెంకాతో రెండో సీడ్ ఎలెనా రిబకినా టైటిల్ సమరంలో తలపడనుంది. గురువారం రాత్రి జరిగిన తీవ్ర సంచలనాత్మక సెమీఫైనల్ పోరులో రిబకినా 3-6, 6-4, 6-4 తేడాతో అమెరికా క్రీడాకారిణి కోకో గాఫ్‌పై విజయం సాధించి తొలిసారి యూఎస్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అరినా సబలెంకా 7-5, 6-2 స్కోరుతో జెస్సికా పెగులాను ఓడించి హ్యాట్రిక్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. ఈ ఇద్దరు దిగ్గజ ప్లేయర్లు ఫైనల్‌కు చేరుకోవడంతో యూఎస్ ఓపెన్ చరిత్రలో మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. 2013లో సెరెనా విలియమ్స్, విక్టోరియా అజరెంకా మధ్య జరిగిన ఫైనల్ తర్వాత, మళ్లీ 13 ఏళ్ల విరామం అనంతరం టోర్నీలోని టాప్-2 సీడ్లు ఫైనల్లో తలపడటం ఇదే తొలిసారి. ప్రదర్శనతో ఇప్పటికే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ స్థానాన్ని ఖాయం చేసుకున్న కజకిస్థాన్ స్టార్ రిబకినా, సబలెంకాపై గెలిచి తన కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ సాధించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు వరుసగా మూడోసారి యూఎస్ ఓపెన్ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించాలని సబలెంకా భావిస్తోంది. ఆర్థర్ యాష్ స్టేడియంలో జరిగే ఈ హై-వోల్టేజ్ ఫైనల్ పోరు టెన్నిస్ ప్రియులకు అసలైన విందు అందించనుంది.



# దాయాదిపై గోల్స్ వర్షం.. భారత్ జయభేరి!

**పాకిస్థాన్‌పై 19-0తో ఘన విజయం**

**క్వార్టర్స్‌లో భారత అమ్మాయిల విధ్వంసం**

**18 పెనాల్టీ కార్నర్లు గోల్స్‌గా మలిచిన భారత్**

**హ్యాట్రిక్‌తో మెరిసిన పూజా మాలిక్**

**పతకానికి రెండడుగుల దూరంలో భారత జట్టు**

**మోఖి (చైనా), సెప్టెంబర్ 11** : జూనియర్ ఆసియా కప్‌లో భారత మహిళల హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఏకంగా 19-0 గోల్స్ తేడాతో చిత్తుచేసింది. ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత అమ్మాయిలు గోల్స్ వర్షం కురిపించి పతకానికి రెండడుగుల దూరంలో నిలిచారు. పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకోవడంలో భారత్ అదరగొట్టింది. ఏకంగా 18 పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలిచి పాకిస్థాన్ రక్షణ శ్రేణిని ఉక్కిరిబిక్కిరి చేసింది. తొలి రెండు క్వార్టర్లలో ఐదేసి గోల్స్ సాధించిన భారత్.. చివరి క్వార్టర్‌లో మరో ఆరు గోల్స్‌తో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. భారత్ తరఫున పూజా మాలిక్ 27, 49, 51వ నిమిషాల్లో గోల్స్ చేసి హ్యాట్రిక్‌తో మెరిసింది. రోష్ని, తనూజా, సుప్రియ, మధు, సనిక తలా రెండు గోల్స్ సాధించి భారీ విజయంలో కీలకపాత్ర పోషించారు. దాయాదిపై 19--0తో తిరుగులేని విజయాన్ని నమోదు చేసిన భారత అమ్మాయిలు జూనియర్ ఆసియా కప్‌లో తమ జోరును కొనసాగించారు.



# ఫైనల్‌కు భారత్

- సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- ఫిఫ్టీతో మెరిసిన షెఫాలి
- స్పిన్నర్ల మాయకు తోకముడిచిన బంగ్లా



**దుబాయ్, సెప్టెంబర్ 11** : మహిళల ఆసియా కప్‌లో ఎనిమిదో టైటిల్‌పై కన్నేసిన భారత్.. ఆ దిశగా మరో అడుగు ముందుకేస్తూ టోర్నీ చరిత్రలో పదో సారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ముగిసిన తొలి సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో గెలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టీమిండియా నిర్దేశించిన 150 పరుగుల ఛేదనలో.. స్పిన్నర్ల ధాటికి బంగ్లా 109/7కే పరిమితమైంది. మొదట బ్యాటింగ్ చేసిన ఉమెన్ ఇన్ బ్లూ.. షెఫాలి వర్మ (40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64) అర్ధశతకానికి తోడు హర్మన్‌ప్రీత్ కౌర్ (24 నాటౌట్), రిచా ఘోష్ (21) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 రన్స్ చేసింది. బంగ్లా తరఫున షోర్నా అక్తర్ (22), దిలారా అక్తర్ (21) టాప్ స్కోరర్లు. దీప్తి శర్మ (3/26), తెలుగమ్మాయి శ్రీచరణి (1/14), ప్రేమ (1/21) స్పిన్ మాయకు 2018 చాంపియన్లు ధాటిగా ఆడలేకపోయారు. శుక్రవారం శ్రీలంక, పాకిస్థాన్ మధ్య జరిగే రెండో సెమీస్‌లో గెలిచే విజేతతో భారత్ ఈనెల 13న జరిగే ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనుంది.

## షెఫాలి మెరుపులు

టోర్నీలో మంచి టచ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (2) రెండో ఓవర్లోనే ఔటై నిరాశపరిచినా షెఫాలి మాత్రం ధాటిగా ఆడింది. వ్యక్తిగత స్కోరు 1, 11 వద్ద బంగ్లా ఫీల్డర్లు క్యాచ్‌లు జారవిడవడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడింది. సుల్తానా ఖటున్ వేసిన నాలుగో ఓవర్లో స్ట్రెయిట్, లాంగాఫ్ మీదుగా భారీ సిక్స్‌లు బాదింది. రబేయ ఓవర్లో ప్రతీక (20) సైతం బంతిని స్టాండ్స్‌లోకి పంపడంతో పవర్‌ప్లేను భారత్ 45/1తో ముగించింది. అయితే రబేయనే వేసిన పదో ఓవర్లో షాట్ ఆడబోయిన ప్రతీక.. కవర్స్‌లో దిలారా అక్తర్ చేతికి చిక్కడంతో 50 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మరుఫా 11వ ఓవర్లో రెండు బౌండరీలు కొట్టిన షెఫాలి.. ఫహిమ బౌలింగ్‌లో సింగిల్‌తో ఈ టోర్నీలో రెండో అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. ఆ మరుసటి ఓవర్లో 6, 4, 4తో ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చిన ఆమె.. ఐదో బంతికి డీప్ మిడ్‌వికెట్ వద్ద ఫర్జానాకు క్యాచ్ ఇవ్వడంతో భారత్ మూడో వికెట్ కోల్పోయింది. ఆఖర్లో రిచా, హర్మన్ మెరుపులతో టీమిండియా మెరుగైన స్కోరు సాధించింది.

## స్పిన్ దెబ్బకు విలవిల్లాడి..

టీ20ల్లో రికార్డు ఛేదన (ఇప్పటివరకు బంగ్లా అత్యధిక ఛేదన శ్రీలంకపై 146)కు దిగిన నిగార్ సుల్తానా సేన.. భారత స్పిన్నర్ల మాయకు 20 ఓవర్లకు 109/7 మాత్రమే చేయగల్గింది. మొదట చరణి పవర్ ప్లే ఆఖరి ఓవర్లో జువారియ (14)ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచింది. టీ20ల్లో ఈ ఆంధ్రా అమ్మాయికి ఇది 50వ వికెట్. 8వ ఓవర్లో బంతినందుకున్న దీప్తి.. దిలారాను వెనక్కిపంపింది. పది ఓవర్లకు ఆ జట్టు స్కోరు 46/2 మాత్రమే. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్.. బంతిని ప్రేమ, షెఫాలి, దీప్తి, చరణికే ఇవ్వడంతో బంగ్లా వేగంగా ఆడలేకపోయింది. భారీ ఆశలు పెట్టుకున్న శోభనా మోస్త్రి (18) కూడా దీప్తి 14వ ఓవర్లో వేసిన బంతికి క్లీన్‌బౌల్డ్ అవగా నిగార్(19)ను ప్రేమ ఔట్ చేసింది. లోయరార్డర్‌లో షోర్నా మెరుపులతో ఆ జట్టు వంద పరుగుల మార్కును దాటగలిగింది.

## సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లకు 149/6 (షెఫాలి 64, హర్మన్‌ప్రీత్ 24లి, సుల్తానా 2/30, రబేయ 1/22); బంగ్లాదేశ్: 20 ఓవర్లకు 109/7 (షోర్నా 22, దిలారా 21, దీప్తి 3/26, నందని 2/10)

# సీఎస్కే షేర్లపై ధోనీకి ఆసక్తి లేదట!

- వాటా కావాలని ఎప్పుడూ అడగలేదన్న ఫ్రాంచైజీ
- శ్రీనివాసన్‌తోనూ చర్చించలేదని వెల్లడి
- ధోనీ వద్ద లక్షకుపైగా షేర్లున్నాయంటున్న కథనాలు
- ప్రైవేట్‌గా కొనుగోలు చేశారంటూ ప్రచారం
- చెన్నై తదుపరి కోచ్ ఎంపికలో ధోనీ కీలకం



**చెన్నై, సెప్టెంబర్ 11** :భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ భవితవ్యంపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ.. చెన్నై సూపర్ కింగ్స్‌లో ఆయన వాటా కొనుగోలు చేశారన్న ప్రచారం ఆసక్తికరంగా మారింది. ధోనీ ఫ్రాంచైజీలో షేర్లు కొనుగోలు చేశారంటూ ఇటీవల కథనాలు వెలువడగా.. సీఎస్కే వర్గాలు మాత్రం వాటిని తోసిపుచ్చాయి. ఫ్రాంచైజీలో వాటా కావాలని ధోనీ తమను ఎప్పుడూ అడగలేదని, ఈ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశాయి. ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచే చెన్నై జట్టుతో విడదీయరాని అనుబంధం ఏర్పరచుకున్న ధోనీకి ఫ్రాంచైజీలో వాటా ఉందన్న వార్తలు ఇటీవల చర్చనీయాంశమయ్యాయి. దీనిపై సీఎస్కే అధికారి ఒకరు స్పందిస్తూ.. "ఫ్రాంచైజీలో వాటా కావాలని ధోనీ ఎప్పుడూ అడగలేదు. ఈ విషయాన్ని మేం చర్చించలేదు. వాటా అంశంపై యజమాని ఎన్. శ్రీనివాసన్‌తో ధోనీ మాట్లాడినట్లు కూడా మాకు తెలియదు" అని పేర్కొన్నారు. అయితే మరోవైపు ధోనీ ఇప్పటికే సీఎస్కే షేర్లు కొనుగోలు చేశారంటూ కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. బహిరంగ మార్కెట్లో కాకుండా ప్రైవేట్ లావాదేవీల ద్వారా ఆయన షేర్లు కొనుగోలు చేసి ఉండొచ్చన్న ప్రచారం సాగుతోంది. సీఎస్కే కంపెనీ స్టాక్ మార్కెట్‌లో నమోదుకాకపోవడంతో ఈ షేర్ల కొనుగోలు ప్రైవేట్‌గా జరిగి ఉండవచ్చని సమాచారం.

## ధోనీ వద్ద లక్షకుపైగా షేర్లు?

'క్రిక్‌బజ్' కథనం ప్రకారం ధోనీ వద్ద లక్షకుపైగా సీఎస్కే షేర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం వాటాదారులతో పోలిస్తే ధోనీ వద్ద ఉన్న షేర్ల సంఖ్య చాలా తక్కువేనని పేర్కొంది. ప్రస్తుతం సీఎస్కే షేర్ల విలువ రూ.37.94 కోట్లుగా ఉన్నట్లు కథనాల్లో పేర్కొన్నారు. అయితే ధోనీ షేర్ల కొనుగోలుపై ఫ్రాంచైజీ అధికారిక వర్గాల ప్రకటనకు, వెలువడుతున్న కథనాలకు మధ్య భిన్నమైన సమాచారం ఉండటంతో ఈ అంశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ధోనీ ఈ నెలాఖరులో స్వదేశానికి తిరిగి రానున్నట్లు సమాచారం. అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి కోచ్ ఎంపికపై ఫ్రాంచైజీ యాజమాన్యంతో ఆయన చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆటగాడిగా ధోనీ భవిష్యత్తుతోపాటు సీఎస్కేలో ఆయన తదుపరి పాత్ర ఏమిటన్నదీ ఆసక్తికరంగా మారింది.

# షఫాలీపై కవ్వింపు సైగలు

- ఫాతిమా సనాపై ఐసీసీ కొరడా!
- పాక్ కెప్టెన్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా
- ఖాతాలో మరో డీమెరిట్ పాయింట్
- రెండేళ్లలో రెండో తప్పిదం
- భారత్‌తో మ్యాచ్‌లో ప్రవర్తనపై చర్య
- 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తుచేసిన భారత్



**దుబాయ్, సెప్టెంబర్ 11** : ఆసియా కప్-2026లో భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో భారత ఓపెనర్ షఫాలీ వర్మను ఉద్దేశించి దూకుడుగా, కవ్వించేలా వ్యవహరించిన పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ ఫాతిమా సనాపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్-1 నిబంధన, ఆర్టికల్ 2.5ను ఉల్లంఘించినందుకు ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతోపాటు ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను జత చేసింది. శనివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ లక్ష్యఛేదనకు దిగింది. రెండో ఓవర్ చివరి బంతికి షఫాలీ వర్మను కాట్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేసిన ఫాతిమా.. ఆ తర్వాత పెవిలియన్ వైపు వెళ్లాలంటూ దూకుడుగా సైగలు చేసింది. ప్రత్యర్థి బ్యాటర్‌ను రెచ్చగొట్టేలా ఉన్న ఈ చర్యను ఐసీసీ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించింది. గత 24 నెలల్లో ఫాతిమా సనా చేసిన రెండో తప్పిదం ఇదే కావడంతో ఆమె ఖాతాలో డీమెరిట్ పాయింట్ల సంఖ్య రెండుకు చేరింది. ఆన్‌ఫీల్డ్ అంపైర్ల ఫిర్యాదు మేరకు ఎమిరేట్స్ ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ సుప్రియా రాణి దాస్ ఈ శిక్షను ప్రతిపాదించారు. ఫాతిమా తన తప్పిదాన్ని అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకపోయిందని ఐసీసీ వెల్లడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ కేవలం 55 పరుగులకే ఆలౌటైంది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత మహిళల జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



# సంయుక్త మీనన్‌కు మరో భారీ ప్రాజెక్ట్

వెండితెరపై గ్లామర్‌తో పాటు అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న యువ కథానాయిక సంయుక్త మీనన్ వరుస అవకాశాలతో దూసుకెళ్తోంది. తక్కువ సమయంలోనే స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు అందుకున్న ఈ భామ.. ప్రస్తుతం పలు భారీ చిత్రాల్లో భాగమైంది. 'స్వయంభు', 'స్లమ్ డాగ్', 'హైంధవ', 'ది బ్లాక్ గోల్డ్' వంటి క్రేజీ ప్రాజెక్టులు ఆమె చేతిలో ఉన్నాయి. తాజాగా మరో ప్రతిష్టాత్మక చిత్రం ఆమె ఖాతాలో చేరింది.

నేడు సంయుక్త మీనన్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక ప్రకటన చేసింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా తెరకెక్కుతున్న 'రాపో–23' చిత్రంలో సంయుక్త కథానాయికగా నటించనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా ఆమెను రాపో–23 ప్రపంచంలోకి ఆహ్వానిస్తూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు.

ఈ సినిమాతో రామ్ పోతినేని తొలిసారి దర్శకుడిగా మెగాఫోన్ పట్టడం విశేషం. హీరోగా నటిస్తూనే సినిమాకు దర్శకత్వ బాధ్యతలను కూడా ఆయనే చేపడుతున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు.

ప్రస్తుతం 'రాపో–23' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసి వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



# 'ది ప్యారడైజ్'పై నాని క్లారిటీ.. రూమర్లకు చెక్

న్యాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సెప్టెంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో వస్తున్న పలు ప్రచారాలపై తాజాగా నిర్వహించిన సమావేశంలో నాని, శ్రీకాంత్ ఓదెల స్పందించారు.సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు, భారీ సంఖ్యలో నటులతో పోరాట సన్నివేశాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని నాని కొట్టిపారేశారు. తన పాత్ర కోసం వేసుకున్న జడల బరువుపై వస్తున్న చర్చపైనా స్పందిస్తూ.. యాక్షన్ సన్నివేశాల్లో తాళ్ల వినియోగం కారణంగా జడలు చిక్కుకుని తలకు గాయాలయ్యాయని తెలిపారు. ఆ సమయంలో తన పరిస్థితిని చూసి నృత్య దర్శకుడు ఆట సందీప్ భావోద్వేగానికి గురై ఆ విషయం చెప్పారని, దాన్ని పెద్దగా చూడొద్దని కోరారు. శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ.. 'ది ప్యారడైజ్' కేవలం తన సినిమా కాదని, ఇది 'జనం సినిమా' అని అభివర్ణించారు. తల్లి, కొడుకు మధ్య సాగే బలమైన భావోద్వేగాలతో కూడిన విప్లవాత్మక కథగా తెరకెక్కించామని తెలిపారు. సినిమా కోసం ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి పనిచేశారని నాని పేర్కొన్నారు. ప్రేక్షకులకు మొదటి సన్నివేశం నుంచి చివరి వరకు ఉత్కంఠభరితమైన అనుభూతి కలుగుతుందని చెప్పారు. మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. ఎలాంటి ట్రైలర్ విడుదల లేకుండానే నేరుగా ప్రేక్షకుల ముందుకు రానున్న 'ది ప్యారడైజ్' ఎలాంటి ప్రభావం చూపిస్తుందో చూడాలి.

# ఏకే-47 టీజర్‌కు ముహూర్తం..



**సినిమా డెస్క్:** విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం ఏకే47' టీజర్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 12న మధ్యాహ్నం 12 గంటలకు టీజర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''ఈసారి వినోదం మామూలుగా ఉండదు.. నెక్స్ట్ లెవల్‌కి వెళ్లబోతోంది'' అంటూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తి పెంచుతోంది. వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై చిన్నబాబు నిర్మిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలతో వెంకటేష్‌కు త్రివిక్రమ్ అందించిన మాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు తొలిసారి దర్శకుడిగా వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'ఇడుపు కాయితం' నుంచి 'శ్రీలత..' పాట విడుదల




**సినిమా డెస్క్:** ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. తెలంగాణ కుటుంబ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ వినోదాత్మక చిత్రానికి వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బన్నీ వాస్, సుకుమార్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'శ్రీలత..' పాటను చిత్రబృందం విడుదల చేసింది. సురేష్ బొబ్బిలి స్వరపరిచిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించగా.. శంకర్ బాబు, మోహన భోగరాజు ఆలపించారు. ప్రియదర్శి, నాగదుర్గ మధ్య కెమిస్ట్రీతో పాటు అందమైన లొకేషన్లు, పిల్లలతో చిత్రీకరించిన నృత్య సన్నివేశాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రస్తుతం చిత్రీకరణ కొనసాగుతున్న ఈ సినిమాను డిసెంబర్ తొలి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



# బలమైన పాత్రలే కావాలంటున్న రకుల్

విభిన్న కథలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న నటి రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం 'రామాయణం'లో కీలక పాత్రలో నటిస్తోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంలో ఆమె శూర్పణఖగా కనిపించనుంది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయి పల్లవి సీతగా, కాజల్ మండోదరిగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో రకుల్ తన కెరీర్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఇప్పటి వరకు చేయని కొన్ని ప్రత్యేకమైన పాత్రల్లో నటించాలని ఉందని తెలిపింది. ముఖ్యంగా తన కెరీర్‌లో ఇప్పటివరకు పూర్తి స్థాయి భావోద్వేగ భరితమైన ప్రేమకథ చేయలేదని, హృదయాలను హత్తుకునేలా, కన్నీళ్లు పెట్టించేంత గాఢమైన ప్రేమకథలో నటించాలనుకుంటున్నట్లు చెప్పింది.

అలాగే చారిత్రక నేపథ్యంతో తెరకెక్కే పీరియడ్ చిత్రంతో పాటు భయానక కథాంశంతో రూపొందే సినిమాలోనూ నటించలేదని, ఈ రెండు విభిన్న జానర్లను కూడా ప్రయత్నించాలని ఉందని రకుల్ వెల్లడించింది.

ఇకపై సినిమాల ఎంపికలో తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చుకోనున్నట్లు ఆమె స్పష్టం చేసింది. సినిమా స్థాయి ఎంత పెద్దది, కథ ఏ జానర్‌కు చెందింది అనేది తనకు అంత ముఖ్యం కాదని.. నటనకు పూర్తి స్థాయిలో అవకాశం ఇచ్చే బలమైన పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని తెలిపింది. తనలోని నటిని సవాల్ చేసే, కొత్త అనుభూతిని అందించే పాత్రలే ఇకపై తన ప్రధాన లక్ష్యమని రకుల్ చెప్పింది.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644